RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 25 ఏప్రిల్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ. 2.00 | సంపుటి:21 | సంచిక:275

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి




వరంగల్: నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు.

క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచిందంటూ సీఎం రేవంత్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోద్దని ఈ సందర్భంగా సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.



# ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ చర్చలు ఫలప్రదం..

# తెలంగాణలో రేపటి నుంచి రోడ్డెక్కనున్న బస్సులు!

### సమ్మె విరమించేందుకు కార్మిక సంఘాల అంగీకారం
### శనివారం ఉదయం నుంచి యథావిధిగా బస్సు సర్వీసులు
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన భేటీ
### అధికారికంగా వెలువడనున్న ప్రకటన

తెలంగాణలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెకు తెరపడనుంది. ప్రభుత్వంతో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలు జరిపిన చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు జేఏసీ నేతలు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, శనివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచే ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కనున్నాయి.

శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రుల బృందం ఆర్టీసీ జేఏసీ నేతలతో సమావేశమైంది. ఈ భేటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతనాలు, పెన్షన్లు, ఇతర ప్రధాన డిమాండ్లపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

జేఏసీ నేతలు ప్రస్తావించిన అంశాలపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ హామీతో జేఏసీ నేతలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సానుకూల పరిణామంతో ఆర్టీసీ సేవలు తిరిగి సాధారణ స్థితికి రావడానికి మార్గం సుగమమైంది. సమ్మె విరమణ వార్తతో ప్రయాణికులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట

### 2011 మిలియన్ మార్చ్ కేసులను కొట్టివేసిన హైకోర్టు
### ట్యాంక్‌బండ్‌పై నాడు నిర్వహించిన మిలియన్ మార్చ్‌లో ఉద్రిక్తత
### కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై కేసు నమోదు



మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2011లో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్‌కు సంబంధించి నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది.

నాడు ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో వీరికి ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం వారిపై నమోదైన కేసులను కొట్టివేసింది.

## తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు.. హోం శాఖ కార్యదర్శిగా శిఖా గోయల్

- తెలంగాణ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శిఖా గోయల్ నియామకం
- తదుపరి డీజీపీగా సీవీ ఆనంద్ వస్తారన్న ఊహాగానాలు
- ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఏప్రిల్ 30న పదవీ విరమణ
- మరో ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం
- మల్కాజ్‌గిరి కొత్త పోలీస్ కమిషనర్‌గా బి. సుమతికి బాధ్యతలు



తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖలో కీలక మార్పులు చేపట్టింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక, రాష్ట్ర తదుపరి డీజీపీగా సీవీ ఆనంద్ రానున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఉన్న 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్‌కు హోంశాఖ బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కూడా ఆమె కొనసాగిస్తారు. శిఖా గోయల్ బదిలీతో, ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీవీ ఆనంద్‌కు డీజీపీగా పదోన్నతి లభించే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయనుండటంతో, ఆయన స్థానంలో 1996 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్‌ను నియమిస్తారని భావిస్తున్నారు. ఆనంద్ గతంలో హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్‌గా, ఏసీబీ డీజీగా పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

ప్రభుత్వం మరో ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులను కూడా బదిలీ చేసింది. దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా నియమించారు. షానవాజ్ ఖాసింను మల్టీ-జోన్-II ఐజీగా బదిలీ చేశారు.

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా తరుణ్ జోషి బాధ్యతలు చేపట్టనున్నారు. అవినాష్ మహంతిని డ్రగ్స్ కంట్రోల్ డీజీగా, ఎక్సైజ్ డైరెక్టర్‌గా నియమించారు. మల్కాజ్‌గిరి కొత్త పోలీస్ కమిషనర్‌గా బి. సుమతిని నియమించారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

- 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధం
- 8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలతో సహా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు రవాణ వసతి ఏర్పాటు

-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వార్తా 2 లో

## మే 4 నుండి మే 9, వరకు రైతు వారోత్సవం



హైద్రాబాద్ ఏప్రిల్ 24 : వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధ్యక్షతన, కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి కార్యాలయంలో ముఖ్య సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై సమగ్రంగా చర్చించారు.

సమావేశంలో ప్రధానంగా వానాకాలం-2026 కోసం వరి విత్తనాల అవసరం మరియు సరఫరా, అలాగే పంటల మార్పిడి పై విశ్లేషణ జరిగింది. వానాకాలం-2026కి సంబంధించి సుమారు 10.80 లక్షల ఎకరాలకు పైగా వరి విత్తనాల ప్రణాళిక రూపొందించబడింది. అందుకు అవసరమైన విత్తనాల సరఫరా, వ్యయం, మరియు ప్రత్యామ్నాయ రకాలను ప్రోత్సహించే అంశాలపై అధికారులు వివరాలు సమర్పించారు.

అలాగే, "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహించబడే రైతు వారోత్సవం కార్యక్రమాలపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమం మే 4 నుండి మే 9, వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడుతుంది.

ఈ వారోత్సవంలో భాగంగా ప్రతిరోజు ప్రత్యేక అంశాలపై రైతులకు అవగాహన కల్పించబడుతుంది:

- నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం
- ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ విస్తరణ, ప్రత్యామ్నాయ పంటలు
- పంట రుణాలు, సహకార సంఘాలు, బీమాలు, మార్కెటింగ్ అవకాశాలు
- సౌరశక్తి, యాంత్రీకరణ, డ్రోన్లు
- పశుసంవర్ధక, మత్స్య, నీటి నిర్వహణ, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పంటల ఉత్పత్తి ఈ అంశాలు ఉంటాయి

ఈ సమావేశంలో సభ్యులు శ్రీ రాములు నాయక్ (మాజీ ఎమ్మెల్సీ), గడుగు గంగాధర్ , భవాని మరికంటి , సునీల్ , రాంరెడ్డి గోపాల్ రెడ్డి , ఖ్వాజ సురేంద్ర మోహన్ , మెంబర్ సెక్రటరీ గోపాల్ , వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్లు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగం స్థిరమైన పురోగతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చైర్మన్ గారు ,సభ్యులు స్పష్టం చేశారు.

ప్రజాబలం

25 ఏప్రిల్ 2026 శనివారం

# బీజేపికి రాహుల్ బలం...

జాతీయ రాజకీయాల్లో శతాబ్ద కాలం పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుత మోదీ శకాన్ని ఎదుర్కోవడంలో అనుసరిస్తున్న వ్యూహాలు ఆ పార్టీని మరింత ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడలను దీటుగా ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమవుతోంది. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపాల్సింది పోయి.. గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోదీ పరిపాలనపై చర్చించకుండా కేవలం ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ప్రతికూలత పెరుగుతోంది. "గతంలో 'మౌత్ కా సౌదాగర్' నుంచి మొన్నటి 'చౌకీదార్ చోర్ హై' వరకు, ఇప్పుడు ప్రధానిని 'టెర్రరిస్టు' అంటూ సంబోధించే స్థాయికి కాంగ్రెస్ నేతలు దిగజారడం ఆ పార్టీకే నష్టం చేకూరుస్తోంది. ఒక దేశ ప్రధానిని అప్రజాస్వామిక పదజాలంతో దూషించిన ప్రతిసారీ మోదీ దానిని అస్త్రంగా మార్చుకుని ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందుతున్నారు. కాంగ్రెస్ ఉక్రోశం నుంచి పుట్టుకొస్తున్న ఇటువంటి వ్యాఖ్యలు రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వాన్ని మరింత బలహీనంగా చూపిస్తున్నాయి. జాతీయ భావాలు బలంగా ఉన్న ఈ రోజుల్లో, ప్రధానిని ఉగ్రవాదితో పోల్చడం సామాన్య ఓటర్లకు మింగుడుపడటం లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఏ సిద్ధాంతంపై నడుస్తోంది? ఏ వర్గాల కోసం పోరాడుతోంది? అనే విషయంలో ప్రజలకే కాదు, ఆ పార్టీ శ్రేణులకు కూడా స్పష్టత లేదు. బీజేపీ హిందుత్వ కార్డును ఎదుర్కోవడానికి సాఫ్ట్ హిందుత్వ ను అనుసరించాలా లేక సెక్యులరిజం వైపు ఉండాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కుప్పకూలుతున్నా, అగ్ర నాయకత్వం కేవలం ఢిల్లీలో కూర్చుని సోషల్ మీడియా వార్లకే పరిమితమవుతోంది. ఈ చేతకాని రాజకీయాల వల్ల రాహుల్ గాంధీ ఇమేజ్ బిల్డప్ అవ్వడం కంటే, మరింత చులకన అవుతోంది. జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలబడాల్సిన కాంగ్రెస్, రోజురోజుకూ ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే స్థితికి చేరుకుంది. 2029 సార్వత్రిక ఎన్నికల ముందు మహిళా రిజర్వేషన్ బిల్లుతో సహా లోక్‌సభ సీట్లను పెంచాలనే బీజేపీ కలకు బ్రేక్ పడింది. లోక్‌సభలో శుక్రవారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దీంతో మహిళా బిల్లుతో సహా మరో బిల్లును కేంద్రం ఉపసంహరించుకుంది. 2/3 వంతు మద్దతును ఎన్డీయే ప్రభుత్వం కూడగట్టలేకపోయింది. బయట నుంచి చూస్తే ఇది బీజేపీకి ఘోర పరాజయంగా కనిపించవచ్చు, కానీ రాజకీయంగా ఇది బీజేపీకి విజయమే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో "ఓడిపోయి బీజేపీ గెలిచింది. గెలిచి కాంగ్రెస్ ఓడిపోయింది" అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓట్లు పడిన తర్వాత, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ.. ఒక చారిత్రాత్మక బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని విమర్శించారు. మహిళా బిల్లును అడ్డుకున్నారని మండిపడ్డారు. అయితే, తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీజేపీకి సంఖ్యా బలం లేదని ముందే తెలుసు. కానీ ప్రతిపక్షాల నుంచి మద్దతు వస్తుందని ఊహించారు. ఒక వేళ ఓడిపోతే ప్లాన్-బికి కూడా బీజేపీ సిద్ధంగా ఉంది. ఇప్పుడు గెలిచినా, ఓడినా క్రెడిట్ మొత్తం బీజేపీ ఖాతాలోకే వెళ్లినట్లయింది. "మహిళా రిజర్వేషన్లకు ప్రతిపక్షాలు, కాంగ్రెస్ వ్యతిరేకం" అని బీజేపీ ఒక రాజకీయ నినాదాన్ని సృష్టించబోతోంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికల ముందు ఇది ఎంతో కొంత ప్రభావం చూపించే అంశంగా మారింది. గురువారం లోక్‌సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ బిల్లును వ్యతిరేకించే వారిని దేశంలో మహిళలు క్షమించరని చెప్పారు. ఇక ఇప్పటి నుంచి ప్రతిపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌పై బీజేపీ విరుచుకుపడుతుంది. కాంగ్రెస్, ఇండీ కూటమి బిల్లుకు వ్యతిరేకమనే ఒక వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తుంది. 2010లో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించి సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీలు రాజకీయంగా కొంత కాలం దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి మన్మోహన్ సింగ్ సర్కార్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును తీసుకువచ్చింది. ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లు వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు బీజేపీ ప్రవేశపెడుతున్న బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమని, దేశ రాజకీయ స్వరూపాన్ని మార్చే కుట్ర అని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాదిస్తున్నారు. వీటన్నింటిని పక్కన పెట్టి బీజేపీ మాత్రం కాంగ్రెస్ మహిళా వ్యతిరేకమనే నేరేటివ్‌ను తయారు చేస్తుంది. మొత్తానికి బీజేపీ బిల్లుల విషయంలో ఓడిపోయినప్పటికీ, రాజకీయ వ్యూహాల్లో మాత్రం గెలిచిందని చెబుతున్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ పై చనగాని దయాకర్ ఫైర్



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** కేంద్ర మంత్రివా, బజారు రౌడీవా శవాల దగ్గర దగ్గర చిల్లర రాజకియలు చేయడమా? రేవంత్ రెడ్డి గారు స్పందించే ముఖ్యమంత్రి కాబట్టి 24 గంటల్లో స్పందించారు, సబ్ కమిటీ మంత్రులతో ఏర్పాటు చేశారు..ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది..ఆర్టీసీ కార్మికుల కోసం ఆరోగ్య భద్రత కోసం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తోంది.. ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి చెందడం బాధాకరం..10 లక్షలు ఇచ్చి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించనుంది..ఆర్టీసీ కార్మికులను రెచ్చ గొట్టి విధంగా బండి సంజయ్ వ్యహరించారు. పార్లమెంట్ లో తెలంగాణ రాష్ట్ర అంశాల గురించి మాట్లాడడానికి చేతకాని బండి సంజయ్, శవాల దగ్గర పెలాల కోసం పోటీ పడుతున్నారు..కార్మికుల న్యాయబద్ధంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందిస్తుంది.. గతంలో 36 రోజులు, 36 మంది కార్మికులను పొట్టపెట్టుకున్నా స్పందించ లేదు ఆనాడు పాలకులు.. తెలంగాణ లో ధర్నాలు, పోరాటాలు ఉండాలని కోరుకున్న ప్రభుత్వం ప్రజా పాలన అన్నారు..తెలంగాణా కార్మికులు దయచేసి ఆత్మబలిదానాలు వొద్దు, మీకు అండగా ప్రభుత్వం ఉంది అన్నారు

# నైపుణ్యాభివృద్ధితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

**నిరంతర సాధనతోనే విజయం సాధ్యం**

**సంకుచిత భావనలు విడిచి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24 ములుగు** శుక్రవారం 99 రోజుల ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవం లో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.నిర్వహించారు.

టాస్క్ సెంటర్, ఐటీడీఏ, డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్, ఉద్యానవన శాఖల ద్వారా యువతకు అందుబాటులో ఉన్న శిక్షణ తరగతులు, ఉపాధి అవకాశాలపై సంబంధిత అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ యువత నైపుణ్యాభివృద్ధితో ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవచ్చని, సంకల్పంతో నిరంతరం సాధన చేస్తే విజయం తప్పనిసరిగా వరిస్తుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని సూచించారు.

ప్రత్యేకంగా ములుగు జిల్లాలోని యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించేందుకు టాస్క్ సెంటర్‌ను ప్రారంభించామని, దీని ద్వారా యువత ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యం సాధించేలా ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

టాస్క్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి 10 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని, ఇందులో 250 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు.

యువత సమయాన్ని వృథా చేయకుండా ఏదైనా రంగంలో పనిచేయాలనే ఆసక్తి కలిగి ఉండాలని, ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని తెలిపారు.

ప్రతిభకు కష్టాలు, పేదరికం అవరోధం కాదని, ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుందని, కష్టాలను, బాధలను అధిగమిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువతకు సూచించారు.

అనంతరం ఐటీడీఏ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, ఐటీడీఏ ఏపీవో కె. నాగోరావు, డీఆర్డీఓ చంద్రశేఖర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ జనార్ధన్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, ఎస్సీ డెవలప్‌మెంట్ ఈడీ ధర్మ నాయక్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, అడిషనల్ పీడీ శ్రీనివాసరావు, ఈ డిస్టిక్ మేనేజర్ దేవేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధియే దేశ ప్రగతికి సోపానం :: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24 ములుగు** శుక్రవారం, జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్య అతిథిగా హాజరై జిల్లా అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధత లభించిందని, 1993 ఏప్రిల్ 24 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చినందున ప్రతి ఏటా ఈ రోజును జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కేవలం నినాదంగా మిగలకుండా, ములుగు జిల్లాలోని ప్రతి పల్లెలోనూ ఆచరణలోకి తేవాలని సూచించారు. అందుకోసం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గ్రామాల సమస్యలను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో పరిష్కరించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పనిచేసి నిధులను సక్రమంగా వినియోగించుకుని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, పారదర్శకత, జవాబుదారీతనంతో పరిపాలన అందించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, డీఆర్డీఓ చంద్రశేఖర్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు.

రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై శుక్రవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు,జెనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు,ఫైనాన్స్,మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగినందున అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు.

ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు.

20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం అయ్యిందని,సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు.

క్షేత్రస్థాయి నుండి వస్తున్న సమాచారం ప్రకారం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానుందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.

ఇప్పటి వరకు నాలుగు లక్షల 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గాను 12 లక్షల మెట్రిక్ టన్నులు నిలువ ఉంచేందుకు వీలుగా గోదాములు గుర్తించామని,మరో 20 లక్షల బాయిల్డ్ రైస్ ను నిలువ ఉంచేందుకు గాను జిల్లాల వారీగా కేటాయింపులు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతే గాకుండా ధాన్యం కొనుగోలుకు గాను కొనోలు కేంద్రాలలో 16 కోట్ల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమను త్వరితగతిన కొలిచేందుకు వీలుగా ప్యాడి క్లినర్లు,డ్రైయర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడ కుడా ఆలస్యం జరగకుండా చూసేందుకు గాను సరిపడా హమాలిలను నియమించాలన్నారు.

తూకం ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా చూసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా ప్రాంతంలో ఉన్న మిల్లులకు తరలించేందుకు రవాణా ఏర్పాట్లను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

అదే సమయంలో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యాం తరలి రాకుండా ఉండేలా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేస్తున్నామన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యానికి అయ్యో మొత్తాలను రైతులకు ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా పౌర సరఫరాలశాఖా మార్కెటింగ్ శాఖలతో పాటు జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

### కమిటీల పేరుతో కాలయాపన చేస్తే సహించేది లేదు
### బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

హైద్రాబాద్ ఏప్రిల్ 24 :ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నది. ఆర్టీసీ సమ్మెను పరిష్కరించాల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది.



తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన పోరుబాట చివరకు సమ్మెకు దారితీసి, రాష్ట్రంలో పరిస్థితిని ఆందోళనకరంగా మార్చింది.

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం ఎంతో కలచివేసే విషయం. ముఖ్యంగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ గారు చికిత్స పొందుతూ మరణించడం అత్యంత బాధాకరం మన్నారు.

కాంగ్రెస్ సర్కారు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చకపోవడం, సమస్యలను పరిష్కరించకపోవడం వల్లే ఈ దారుణ పరిస్థితి ఎదురైంది.

శంకర్ గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయన కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలి.

దీనితోపాటు, ఆర్టీసీ కార్మికులు ముందుగానే ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినా కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరం, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికులు సమ్మెకు దిగినప్పుడు, భారతీయ జనతా పార్టీ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసింది.

అదే విధంగా, 2017 నుంచి ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడం కూడా ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసిన విషయం తెలిసిందే.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి.

కార్మికుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్మికులకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. వారి హక్కుల కోసం మేము పోరాటం కొనసాగిస్తున్నాం, కొనసాగిస్తూనే ఉంటాం. ఆర్టీసీ కార్మికుల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలుస్తుంది. తెలంగాణ సమాజం మొత్తం కూడా ఈ పోరాటంలో కార్మికుల పక్షాన నిలుస్తోంది.

అయితే, ఈ సందర్భంగా నేను ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాను.. ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దు. మీ సమస్యల పరిష్కారం కోసం బిజెపి పోరాటం కొనసాగుతుందన్నారు

# చిన్నపాటి సాగునీటి వనరుల పునర్వ్యవస్థీకరణ సమగ్ర నోట్ సమర్పన



హైద్రాబాద్ ఏప్రిల్ 24 ()తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో చిన్నపాటి సాగునీటి వనరుల పునర్వ్యవస్థీకరణ చెరువుల పరిరక్షణ కమిటీల ఏర్పాటు మరియు చెరువుల మట్టి తొలగింపు అంశాలపై రూపొందించిన సమగ్ర నోట్ను గౌరవనీయులైన ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి కమిషన్ సమర్పించింది.

ఈ నేపథ్యంలో, కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి నాయకత్వంలో సాగునీటి శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రతినిధులు మరియు నిపుణులతో పలు సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాల్లో చెరువుల పరిరక్షణకు స్థిరమైన వ్యవస్థ అవసరం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు డిసిల్టింగ్ ప్రాముఖ్యత వంటి అంశాలపై సవివరంగా చర్చించారు.

సమావేశాల్లో జరిగిన చర్చల ఆధారంగా, చెరువుల పరిరక్షణ కమిటీల ఏర్పాటు మరియు డిసిల్టింగ్ కార్యక్రమాల అమలుకు సంబంధించిన సమగ్ర నివేదికను కమిషన్ రూపొందించి, గౌరవ మంత్రివర్యులకు సమర్పిస్తూ తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరింది.

ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు శ్రీ కేవీ నర్సింహ రెడ్డి , భవాని మరికంటి గడుగు గంగాధర్ , సునీల్ , రాంరెడ్డి గోపాల్ రెడ్డి , మెంబర్ సెక్రటరీ గోపాల్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ మరియు సమర్థవంతమైన నీటి వినియోగం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని కమిషన్ పేర్కొంది.

# ఎమ్మెల్యేలకు నిరసన సెగ. కొనుగోలు కేంద్రాలలో సమస్యలపై నిలదీత.



నాగర్ కర్నూల్ ఏప్రిల్ 24( ) జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దిశా సమావేశానికి హాజరు అయ్యేందుకు వెళ్తున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలకు నిరసన సెగ తగిలింది. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలు పట్టించుకోవడంలేదని గత 15 రోజులుగా ధాన్యాన్ని తరలించిన కొనుగోలు చేయడం దానిని తరలించకపోకపోవడంతో పడి కాపులు కాయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంలోనే అటుగా వెళుతున్న ఎమ్మెల్యేల కాన్వాయ్ ను రైతులు అడ్డుకొని తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి తో పాటు పలువురు నాయకులు ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ఎవరు ఆందోళన చెందవద్దని వివరించిన రైతులు తమ డిమాండ్లను పరిష్కరించే వరకు తన వ్యక్తం చేస్తామని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులతో స్థానిక ఎమ్మెల్యే మాట్లాడి వెంటనే ధాన్యాన్ని తరలించాలని మార్కెట్ యార్డులో నెలకొని ఉన్న సమస్యను పరిష్కరించాలని హామీ ఇచ్చారు అయినా రైతులు మార్కెట్ యార్డును సందర్శించాలని తమ సమస్యలు తెలుసుకోవాలని పట్టుబట్టారు కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి ధాన్యం తరలించిన రైతులు పాల్గొన్నారు

# గోల్డ్ అప్రైజర్ అంత్యక్రియలకు విశ్వంలో విలీనం, వెస్సో ట్రస్టుల సాయం




హైదర్సబాద్ ఏప్రిల్ 24 ;తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన స్వర్ణకారులు వెదురుపర్తి వీర వెంకట వరప్రసాద్(52) స్థానికంగా బంగారపు పనులు తక్కువగా ఉన్న పరిస్థితుల్లో విజయవాడ లో బ్యాంక్ అప్రైజర్ గా ఈ మధ్యనే ఉద్యోగం సంపాదించి, విజయవాడ కు నివాసం మార్చారు. దురదృష్టవశాత్తు, కొద్ది రోజుల క్రింద హఠాత్తుగా వారికి గుండెపోటు వచ్చి శివైక్యం చెందారు.

వారు తమ కూతురికి ఇదివరకే వివాహం చేశారు. కొడుకు సాయి నందన్ కుమార్ ఇటీవలే ఒక చిరుద్యోగంలో చేరారు.

తన తండ్రి అంత్యక్రియలు పూర్తి చేయడానికి తమ ఆర్థిక పరిస్థితి సహకరించట్లేదని, అంత్యక్రియలు పూర్తి చేయడానికి ఆర్థిక సహాయం అందించవలసినదిగా సాయి నందన్ కుమార్ విశ్వంలో విలీనం మరియు వెస్సో ట్రస్ట్ లను కోరారు. స్పందించిన విశ్వంలో విలీనం మరియు వెస్సో ట్రస్టు లు సంయుక్తంగా పదివేల రూపాయలు అందజేసినట్లుగా విశ్వంలో విలీనం సంస్థాపక అధ్యక్షులు పెంట శ్రీనివాస ఆచార్య తెలిపారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ, అంత్యక్రియలు వంటి పుణ్య కార్యక్రమాలకు విశేషంగా సహకారం అందిస్తున్న బెంగళూరుకు చెందిన లక్కోజు పూర్ణిమ ను అభినందించారు.

# హయత్ నగర్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు బిజెపి మద్దతు

### ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు తక్షణమే ?1 కోటి ఆర్థిక సాయం అందించాలి
### మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్

రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 24:రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిర్వహించిన సంఘీభావ కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దివంగత ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు తక్షణమే ?1 కోటి ఆర్థిక సాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతూ...

తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికుల ఉద్యమ పోరాటం మరువలేనిది. ఆర్తి తెలంగాణ ఉద్యమకారుల ఉసురు ఆర్టీసీ ఉద్యమకారుల ఉసురు తప్పక తగులుతుంది కాంగ్రెస్ ప్రభుత్వానికి అని అన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన 5 ముఖ్య హామీలను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు.

టీఎస్ ఆర్టీసీ సిబ్బంది సంక్షేమం కోసం ప్రధాన డిమాండ్లు:

లి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేసి, రెండు ౄ=జ బకాయిలను తక్షణమే చెల్లించాలి.

లి వచ్చే ౄ=జ పరిధిలోకి ఋ=ఙజ కార్మికులను తీసుకురావాలి.

లి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పించాలి.

లి ఆర్టీసీ బస్సులను ఆధునీకరించి విస్తరించి, అధునాతన సౌకర్యాలతో కొత్త సర్వీసులను ప్రారంభించాలి.

లి ఆర్టీసీ యూనియన్ పునరుద్ధరణకు అనుమతి ఇవ్వాలన్నారు

అంతేకాకుండా, ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, వెంటనే పరిష్కరించకపోతే మరింత ఉద్ధృతమైన ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందన్నారు.

# BJPలో చేరిన రాఘవ్ చడ్డా



న్యూ డిల్లి ఏప్రిల్ 24;జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం. ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చడ్డా BJPలో చేరారు. ఆయనతో పాటు మరో ఇద్దరు MP\T సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ ఆ పార్టీలో జాయిన్ అయ్యారు. ఇటీవల పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి ఆప్ చడ్డాను తొలగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చడ్డా మాట్లాడుతూ.. తమకు ఫ్రీలు హర్భజన్ సింగ్, స్వాతి మాలీవాల్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ సపోర్ట్ చేస్తున్నట్లు చెప్పారు.

కేంద్ర మంత్రిగా రాఘవ్ చడ్డా?

ఎంపీ రాఘవ్ చడ్డా ఆప్ నుంచి బీజేపీలో చేరడం కేంద్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ క్రమంలోనే ఆయనకు బీజేపీ నుంచి కేంద్ర మంత్రి ఆఫర్ కూడా వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలో రాఘవ్ సెంట్రల్ మినిస్టర్ అవుతారని వార్తలొస్తున్నాయి. ఇదే జరిగితే ప్రజా సమస్యలపై ప్రశ్నించిన గొంతు.. వాటి పరిష్కారాలకు అధికారులను ఆదేశించే స్వరంగా మారొచ్చు. త్వరలోనే మంత్రి పదవిపై క్లారిటీ రానుంది.

# మాజీ మంత్రి సబిత అరెస్టు

జనగామ ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ రెచ్చగొట్టే విధానం వల్ల నర్సంపేటలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోత్ కవిత లను పోలీసులు అరెస్టు చేసి జనగాం రూరల్ పోలీస్ స్టేషన్ తరలించారు. వారిని వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి నిరసనకు దిగారు.

# పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోండి...

## 28 కేటగిరిలలో ఫించన్లు

విజయవాడ, ఏప్రిల్ 24ఏపీ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ నుంచి కొత్తవారికి పింఛన్లు ఇవ్వాలని కసరత్తు చేస్తున్నారు. ముందుగా వితంతువులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నారు. మొత్తం 1.53 లక్షల మంది అర్హులని అంచనా వేస్తున్నారు. జూన్ నెలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న సందర్భంగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. వితంతువుల తర్వాత దివ్యాంగులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం త్వరలోనే తీపికబురు చెప్పనుంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నవారికి ఊరట కల్పించేందుకు కసరత్తు చేస్తోంది. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి.. ముందుగా అర్హులైన వారికి వితంతు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది జూన్ 12కు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతోంది. ఆ రోజు నుంచి వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మొత్తం 1.53 లక్షలమంది వితంతు పింఛన్‌లకు అర్హులు ఉంటారని అంచనాలు ఉన్నాయి. వీరందరికి కొత్తగా పింఛన్లు నెలకు రూ.4 చొప్పున ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ 1.53 లక్షలమందికి పింఛన్ల కోసం నెలకు రూ.61 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఇప్పటికే పింఛన్ తీసుకునే భర్త చనిపోతే.. వారి స్థానంలో భార్యకు స్పౌజ్ కేటగిరిలో పింఛన్ ఇస్తోంది. ఈ ప్రక్రియ ప్రతి నెలా కొనసాగుతోంది.. కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్న సంగతి తెలిసిందే. వెంటనే భార్య పేరు మీద ఆ తదుపరి నెల నుంచి రూ.4వేలు చొప్పున రుణం మంజూరు చేస్తోంది. ఇలా మొత్తం 2.30 లక్షలమందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. అయితే 60 ఏళ్లలోపు మగవారికి పింఛన్లు రావు.. ఒకవేళ భర్త చనిపోతే భార్య వితంతు కింద పింఛన్ మంజూరు చేస్తారు. అందుకే వీరందరికి ముందుగా వితంతు కేటగిరీలో కొత్త పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది.వితంతు కేటగిరిలో పింఛన్లు మంజూరు చేసిన తర్వాత అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దివ్యాంగుల కేటగిరిలో ఏకంగా లక్షమంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే దివ్యాంగుల కోటాలో ప్రస్తుతం 6.50 లక్షలమంది పింఛన్లు తీసుకుంటున్నారు. వీరిలో ఓ లక్షమంది వరకు అనర్హులు ఉన్నారు.. ఈ లక్షమంది అనర్హుల్ని ఎలా నిరోధించాలని కసరత్తు జరుగుతోంది. ఏపీ ప్రభుత్వం ప్రతి నెలా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలతో పాటుగా ఆరోగ్య పింఛన్లతో కలిపి 28 కేటగిరీల్లో పంపిణీ చేస్తోంది. కొత్త పింఛన్ల కోసం దాదాపు 10 లక్షలమంది వరకు దరఖాస్తు చేసుకునే ఛాన్స్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి పింఛన్లు ఇవ్వాలంటే నెలకు రూ.400 కోట్లు.. అదే ఏడాదికి అయితే రూ.4,800 కోట్లు ఖర్చవుతుందనే అంచనాలు ఉన్నాయి. మొత్తం మీద కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లకు సంబంధించి కసరత్తు మొదలుపెట్టింది. త్వరలోనే కొత్త పింఛన్ల అంశంపై పూర్తిస్థాయిలో క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.. జూన్ నాటికి అర్హులకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు.

వితంతువులు, దివ్యాంగులకు..

ఏపీలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వారికి గుడ్ న్యూస్. జూన్ నుంచి కొత్త పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.కూటమి వచ్చిన తర్వాత కేవలం స్పౌజ్ పింఛన్లు మాత్రమే అందించింది. కానీ కొత్తగా వితంతు పింఛన్లు ఇంతవరకు అందించలేదు. దీంతో ముందుగా వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.53 లక్షల మంది వితంతు పింఛన్లకు అర్హులుగా తేలింది. కూటమి అధికారంలోకి వచ్చి జూన్ నాటికి రెండేళ్లు పూర్తవుతుంది.. ఆ సందర్భంగా వితంతు పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వితంతువులకు పూర్తయిన తర్వాత దివ్యాంగులకు సైతం కొత్త పింఛన్లు మంజూరు చేసే అవకాశం ఉంది. క్రమేపి పురుషుల్లో కూడా కొత్తవారికి, ఓల్డ్ ఏజ్ పెన్షన్లు అందించనుంది ప్రభుత్వం.ఈ ఏడాది జూన్ 12 నాటికి కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతుంది. ఆ రోజు నుంచి వితంతు పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మొత్తం 1.53 లక్షల మంది వితంతు పింఛన్లకు అర్హులు అని అంచనాలు ఉన్నాయి. వీరందరికీ పింఛన్లు మంజూరు చేయాలన్న ఆలోచనలో ఉంది ప్రభుత్వం. నాలుగు వేల రూపాయల చొప్పున వీరికి పింఛన్ మొత్తం అందనుంది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతినెల రూ.61 కోట్లు అదనపు భారం పడనుంది.. అయితే కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అందుకే ఇప్పుడు ముందుగా వితంతువులకు, తర్వాత దివ్యాంగులకు, చివరిగా ఓల్డ్ ఏజ్ వారికి పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నిర్ణయం తీసుకుంది. భర్త చనిపోతే ఆ నెల నుంచి భార్యకు పింఛన్ వర్తింపజేశారు. ఇలా ఇప్పటివరకు 2.30 లక్షల మందికి కొత్త పింఛన్లు అందజేశారు. అయితే వితంతువులు లక్షలాదిమంది పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అందుకే వారికి ముందుగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు దివ్యాంగులకు సైతం అందించేందుకు నిర్ణయించింది ప్రభుత్వం. దివ్యాంగుల కోటాలో ఏకంగా లక్ష మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం 6.50 లక్షల మంది దివ్యాంగులు పింఛన్లు తీసుకుంటున్నారు. మొత్తానికైతే ఏపీలో కొత్త పింఛన్ల ప్రక్రియ అప్పుడే ప్రారంభం అయ్యింది.

# నేరేడి ప్రాజెక్టు డీపీఆర్ రెడీ..

శ్రీకాకుళం, ఏప్రిల్ 24, ఉత్తరాంధ్రవాసులు, ముఖ్యంగా శ్రీకాకుళ జిల్లావాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజి నిర్మాణానికి ఇటీవల అడ్డంకులు తొలగిపోయాయి. ఏపీ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది.. ఈ క్రమంలో తొలి అడుగు పడింది. తాజాగా నేరడి బ్యారేజీకి సంబంధించి రూ.70 కోట్లతో కొత్త డీపీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అలాగే ఒడిశా ప్రభుత్వానికి కూడా త్వరలో లేఖ రాయనున్నారు.శ్రీకాకుళంజిల్లా వాసుల ఎన్నో ఏళ్ల నిజం కాబోతోంది.. దాదాపు 65 ఏళ్ల తర్వాత కీలక ముందగుడు పడింది. ఎంతో కాలంగా ఎదరు చూస్తున్న నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం కొత్త డీపీఆర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇటీవల వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తీర్పుపై కేంద్రం గెజిట్ నోటిఫై చేసిన సంగతి తెలిసిందే.. దీంతో బ్యారేజీ నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. దీంతో ఏపీ ప్రభుత్వం బ్యారేజ్ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవడంతో కొత్త డీపీఆర్ తయారీ, సర్వే సహా ఇతర పనుల కోసం రూ.70 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.శ్రీకాకుళం జిల్లాలో ఈ నేరడి బ్యారేజి ఆలస్యంకావడంతో నీళ్ల మళ్లింపు కోసం సైడ్ వియర్ నిర్మించారు.. కానీ ఆ ప్రయత్నం విజయవంతంకాలేదు. హిరమండలంలో ఎత్తిపోతలను ప్లాన్ చేసి.. మొత్తం 19.5 డీఎంసీల నీళ్లు మళ్లించాలని భావించారు.. కానీ ఆ నిర్మాణం కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. ఇప్పుడు నేరడి బ్యారేజి పనులు చేపట్టి పూర్తిచేస్తే తొలిదశలో లక్షా 48వేల ఎకరాలకు నీళ్లు అందించొచ్చని చెబుతున్నారు. రెండో రెండో దశలో మరో లక్షా 7వేల 280 ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చంటున్నారు. సాగునీరుతో పాటుగా తాగునీటి సమస్య కూడా తీరుతుందని.. వంశధార-నాగావళి అనుసంధానం పలితాలు దక్కుతాయంటున్నారు.శ్రీకాకుళం జిల్లా భామిని మండలం నేరడి దగ్గర బ్యారేజీ నిర్మాణానికి 1961లో తొలి అడుగు పడింది.. అప్పటి నుంచి కోర్టు చిక్కులతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లోనే ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేరడి బ్యారేజీ అంశం గురించి కేంద్రంతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లిన సమయంలో కేంద్ర జలశక్తిమంత్రి, ఆ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఇటీవల నేరడి బ్యారేజ్‌కు సంబంధించి.. వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తుది తీర్పును అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ వచ్చేసింది. మరోవైపు ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కూడా ఉపసంహరించుకునేలా ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరినవాటిని పరిష్కరించేందుక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పింది. త్వరలోనే ఒడిశా ప్రభుత్వానికి లేఖ రాసే అవకాశం ఉందంటున్నారు.

# ఒంటిమిట్ల రామాలయ పూజరులకు నోటీసులు

కడప, ఏప్రిల్ 24, ఒంటిమిట్ట కోదండ రామాలయ అర్చకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి ఆశీర్వచనం అందించడం ప్రస్తుతం టీటీడీలో పెను దుమారం రేపుతోంది. ఈ ఘటనపై టీటీడీ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఒంటిమిట్ట కోదండ రామాలయానికి చెందిన అర్చకులు ఎ. శ్రావణ్ కుమార్, వీణా మనోజ్ కుమార్, కె. పార్థసారథిలు ఇటీవల పులివెందులకు వెళ్లారు. అక్కడ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. అయితే, టీటీడీ పరిధిలో పనిచేసే అర్చకులు ఎవరైనా సరే ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలంటే ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. కానీ, ఈ ముగ్గురు అర్చకులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, అనుమతి తీసుకోకుండా వెళ్లడం నిబంధనల ఉల్లంఘనగా అధికారులు భావిస్తున్నారు. కేవలం ఆశీర్వచనం ఇవ్వడమే కాకుండా, ఆలయానికి సంబంధించిన అత్యంత పవిత్రమైన శేష వస్త్రాన్ని, రాములోరి తోమాలను, ముత్యాల తలంబ్రాలను జగన్‌కు అందజేశారు. సాధారణంగా ఇవి ప్రభుత్వం తరపున అధికారికంగా లేదా అత్యున్నత హోదాలో ఉన్న వ్యక్తులకు ప్రోటోకాల్ ప్రకారం అందజేయాల్సి ఉంటుంది. అర్చకులు తమ స్వంత నిర్ణయంతో వీటిని తీసుకువెళ్లి అందజేయడం టీటీడీ నిబంధనలకు విరుద్ధమని, ఇది అర్చకుల అత్యుత్సాహమేనని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన టీటీడీ ఉప కార్యనిర్వహణాధికారి ఎ. ప్రశాంతి సంబంధిత అర్చకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. టీటీడీ నిబంధనలను అతిక్రమించి, రాజకీయ నాయకుల నివాసాలకు వెళ్లి ఆశీర్వచనాలు అందించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు, సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు గాను వివరణ కోరారు. నోటీసులు అందుకున్న అర్చకులు శ్రావణ్ కుమార్, మనోజ్ కుమార్, పార్థసారథిలు రెండు రోజుల్లోగా తమ వివరణను లిఖితపూర్వకంగా సమర్పించాలని అధికారులు ఆదేశించారు. వారిచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే తదుపరి క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# రూ. 403 కోట్ల పనులెప్పుడు

తిరుపతి, ఏప్రిల్ 24, తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో రూ. 1,586 కోట్లతో చేపట్టిన స్మార్ట్ సిటీ పనులు అస్తవ్యస్తంగా మారాయి. 2019 ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కీలక ప్రాజెక్టులను పక్కన పెట్టేసింది. ఫలితంగా సుమారు రూ. 403 కోట్ల విలువైన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై దృష్టి సారించింది.ప్రస్తుతం ఆగిపోయిన పనులు పూర్తి కావడానికి మరో రూ. 246.90 కోట్లు అవసరమని అంచనా. ముఖ్యంగా సిటీ ఆపరేషన్ సెంటర్ (కమాండ్ కంట్రోల్ సెంటర్) భవన నిర్మాణానికి రూ. 274.50 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు కేవలం రూ. 27.60 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన రూ. 246.90 కోట్లు వస్తేనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం ఉంది.తుకివాకంలో నిర్మిస్తున్న 24 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్లాంట్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీనికోసం రూ. 45.75 కోట్లు కేటాయించగా, రూ. 21.17 కోట్లు ఖర్చయ్యాయి. మిగిలిన నిధులను 'అమృత్ 2.0' పథకం ద్వారా సేకరించాలని అధికారులు భావిస్తున్నారు. గొల్లవానిగుంట స్టేడియం, బాస్కెట్‌బాల్ ఇండోర్ స్టేడియం పనులు అసంపూర్తిగా ఉండటంతో వాటిని ఇతర ప్రభుత్వ సంస్థలకు అప్పగించే యోచనలో ఉన్నారువినాయక సాగర్ వద్ద దుకాణాలు, నెహ్రూ మున్సిపల్ పాఠశాల మైదానంలో పనుల కోసం రూ. 4.91 కోట్లు కేటాయించగా, రూ. 2.38 కోట్లు చెల్లించారు. మిగిలిన నిధులను నగరపాలక సంస్థ సమకూర్చుకోవాల్సి ఉంది.పిపిపి (ఖఖఖ) పద్ధతిలో తుకివాకంలో 6 మెగావాట్ల సోలార్ ప్లాంట్, రైల్వే స్టేషన్ వద్ద మల్టీ లెవల్ కార్ పార్కింగ్ పనులను పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. కార్ పార్కింగ్ ప్రాజెక్టు కోసం రూ. 74.30 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ. 21.64 కోట్లు ఖర్చయ్యాయి. ఈ పనులను హైదరాబాద్‌కు చెందిన సంస్థలకు అప్పగించేలా సంప్రదింపులు జరుపుతున్నారు.

# ఉత్తరాంధ్రలో పుంజుకోని ఫ్యాన్

విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఒకప్పుడు దూకుడుగా ఉన్న వైసీపీ ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. కీలక నాయకులు ఉన్నప్పటికీ.. ఎవరికి వారు పార్టీలో స్వతంత్ర నాయకులుగా వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం. ఇది .. పార్టీని ముందుకు తీసుకువెళ్లకపోగా.. మరింత వెనక్కి నెడుతోందని తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కన్నబాబును ఉత్తరాంధ్ర ఇంచార్జ్‌గా నియమించిన తర్వాత.. పార్టీలో సహకారం కొరవడింది. దీంతో ఆయనను కేవలం విశాఖకు పరిమితం చేశారు.అయినా కూడా బొత్స సత్యనారాయణ సామాజిక వర్గం పార్టీలో వేర్వేరు గ్రూపులు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతోంది. జిల్లాల పరంగా చూసుకుంటే.. టీడీపీ, జనసేనలకు ఉన్న బలం వైసీపీకి కనిపించడం లేదు. విశాఖలో ఎంపీ భరత్ సహా టీడీపీ సీనియర్లు.. పార్టీని బలంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. కానీ, ఇదేసమయంలో వైసీపీ తరఫున బలమైన వాయిస్ వినిపించే గుడివాడ అమర్నాథ్ వంటి వారికి పార్టీలో సహకారం అంతంత మాత్రమేనన్నది సీనియర్లే చెబుతున్నారు.ఇక, శ్రీకాకుళంలో ధర్మాన సోదరులపైనే వైసీపీ ఆధారపడింది. మాజీ మంత్రిసీదిరి అప్పలరాజును వైసీపీ నాయకులు పక్కన పెట్టేశారు. మరోవైపు.. ఇదే జిల్లాలో జనసేన, టీడీపీ తరఫున కింజరాపు ఫ్యామిలీ సహా.. ఇతర నాయకులు బలంగా పార్టీ లను ముందుకు తీసుకువెళ్తున్నారు. వీరి దెబ్బతో వైసీపీ ఎక్కడా పుంజుకునే పరిస్థితి కూడా లేదని అంటున్నారు. పోనీ.. పాత నాయకులు అయినా.. బయటకు వస్తున్నారా? అంటే.. కేవలం మీడియా సమావేశాలకే పరిమితం అవుతున్నారు.ఇక, విజయనగరంలో వైసీపీ చీలికలు పేలికలుగా తయారైందన్నది పార్టీలో కొన్నాళ్లుగా చర్చ సాగుతోంది. జిల్లాలో బొత్స ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ద్వారా.. వైసీపీ పెద్ద పొరపాటు చేసిందన్న వాదన వినిపిస్తోంది. ఇక, ఇదేజిల్లాలో జనసేన భారీగా పుంజుకుంటోంది. దీనికి టీడీపీ సహకారం కూడా తోడైంది. దీంతో ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలలోనూ.. వైసీపీ వర్గ పోరుతో ముందుకు సాగలేక.. వెనక్కి రాలేక ఇబ్బందులు ఎదుర్కొంటే.. జనసేన+టీడీపీ ఉమ్మడిగా జిల్లాలను దున్నేసే పరిస్థితి నెలకొంది.

# సీ ప్లేన్ తో పర్యటకానికి ఊపు

విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీప్లేన్ సేవలతో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కల్పించేందుకు సిద్ధమైంది. దీని కోసం వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండుచోట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తి చేశారు. అల్లూరి జిల్లాలోని సీలేరు, జోలాపుట్టు ప్రాంతాల నుంచి సీప్లేను నడిపేందకు ఏరోడ్రోమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకుల్ని ఆకర్షించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సీప్లేన్‌లు నడిపేందుకు సిద్ధమైంది.. విజయవాడ నుంచి శ్రీశైలానికి ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తికాగా.. మరికొన్నిచోట్ల కూడా సీప్లేన్‌లు నడిపేందుకు కసరత్తు చేస్తోంది. అమరావతి, తిరుపతి, గండికోట ప్రాంతాలలో సీప్లేన్ ప్లాన్ చేశారు. అయితే ఉత్తరాంధ్రలోని ప్రకృతి అందాలకు, పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సీప్లేన్‌లు నడపాలని నిర్ణయించింది. అల్లూరిసీతారామరాజు జిల్లాలో నీటిపై తేలుతూ, గాల్లో ఎగురుతూ ప్రకృతి అందాలను తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. సీప్లేన్ సర్వీసులపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.జిల్లాలో సీప్లేన్‌లను జోలాపుట్టు, సీలేరు ప్రాంతాల నుంచి నడిపేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. సీలేరులోరూ. 16.08 కోట్లు.. జోలాపుట్టులో రూ. 16 కోట్లతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. సీలేరులో ఉన్న గుంటవాడ జలాశయం దగ్గర ఉన్న మారెమ్మ ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. అక్కడ సమీపంలోనే భూమిని ఈ సీప్లేన్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ఇక జోలాపుట్టు జలాశయం దగ్గర సీప్లేన్ కోసం ఏర్పాట్లు చేయనున్నారు. పర్యాటకులు సీప్లేన్‌లో విశాఖపట్న నుంచి ముంచంగిపట్టు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ మార్గంలో అరకు అందాలను వీక్షించవచ్చు. లంబసింగి, చింతపల్లి, సీలేరు ప్రాంతాలను.. గిరిజన సంప్రదాయాలు, జీవనశైలిని చూస్తూ అలా సీలేరులో ఏర్పాటు చేసే వాటర్ ఏరోడ్రోమ్ చేరుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు.సీప్లేన్ కోసం ఏరోడ్రోమ్‌లు ఏర్పాటు చేస్తే.. దాని చుట్టూ రెస్టారెంట్లు, భవనాలు, రెస్ట్ రూంలు కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు ఎక్కువమంది వస్తుంటారు. ఈ సీప్లేన్‌లు అందబాటులోకి వస్తే.. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించవచ్చని భావిస్తున్నారు. అల్లూరి జిల్లాలో రెండుచోట్ల వాటర్ ఏరోడ్రోమ్‌లు మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయసేకరణ పూర్తి చేశామన్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మొత్తం మీద ఉత్తరాంధ్రలోని మన్యంలో రెండుచోట్ల సీప్లేన్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.. త్వరలోనే ఈ ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.

# చంద్రబాబు బయోపిక్ అడుగులు



విజయవాడ ఏప్రిల్ 24, తెలుగు రాజకీయ నేతల బయోపిక్ లు మంచి ఆదరణ పొందాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి బయోపిక్ యాత్ర సినిమా ద్వారా తెరకెక్కించారు. విశేష ప్రేక్షకాదరణ పొందింది ఆ చిత్రం. ఎన్టీఆర్ కథానాయకుడు, నాయకుడు పేరిట బయోపిక్ వచ్చింది. ఆయన కుమారుడు నందమూరి బాలకృష్ణ ఎన్టీఆర్ పాత్రలో మెప్పించారు. అయితే ఇప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు బయోపిక్ రానుంది. చంద్రబాబు జీవితంలోని ముఖ్యమైన సంఘటనల ఆధారంగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ మేరకు దర్శకుడు భానుశంకర్ ప్రకటన చేశారు. రాజధాని ఫైల్స్ చిత్రంతో అమరావతి రైతుల త్యాగాన్ని, రాజధాని అవసరాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు దర్శకుడు భాను ప్రకాష్. ఆ చిత్రంతో బాగానే మెప్పించారు. ఇప్పుడు చంద్రబాబు బయోపిక్ తీయాలని నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా చంద్రబాబు రాజకీయ జీవితం అంటే చాలా రకాల పాత్రలు ఉంటాయి. దీంతో చంద్రబాబు పాత్ర ఎవరు పోషిస్తారు? మిగతా పాత్రధారులు ఎవరు? అనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది.సామాన్యుడిగా జీవితం ప్రారంభించి.. విద్యార్థి సంఘ నేతగా ఎదిగి.. రాజకీయాల్లోకి వచ్చి చంద్రబాబు( రాణించిన తీరు భిన్నంగా ఉంటుంది. ఆయన ప్రతి అడుగు సవాళ్లతో కూడుకున్నదే. అయితే చంద్రబాబును సినిమాలో ఎలా చూపిస్తారు అనేది ఇప్పుడు ఆసక్తి. చంద్రబాబు జీవితంలో జరిగిన ప్రతి ఘట్టంలో ఒక ఉద్వేగం, ఒక సంఘర్షణ దాగి ఉంది. దానిని బయోపిక్ లో చూపిస్తాను అంటున్నారు దర్శకుడు భాను ప్రకాష్.. అయితే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, నిర్మాణ సంస్థ వివరాలు, షూటింగ్ విశేషాలు, ఇతర సమాచారం త్వరలో వెల్లడిస్తానని చెబుతున్నారు భాను ప్రకాష్. చంద్రబాబు పాత్రలో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. ఎన్టీఆర్ బయోపిక్ లో చంద్రబాబు పాత్రధారిగా దగ్గుబాటి రానా నటించారు.

అయితే రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన సినిమాల్లో చంద్రబాబు పాత్రధారి బాగా ఆకట్టుకున్నారు. ఆయన అయితే అచ్చం గుద్దినట్టు సరిపోతారు అనేది ఒక అంచనా. మరోవైపు ఇతర నేతలు, ముఖ్యుల పాత్రల కోసం ఎవరిని ఎంపిక చేస్తారు అనేది ప్రశ్న. చిన్న స్థాయి నుంచి ప్రారంభమైన చంద్రబాబు ప్రయాణం.. క్రమంగా రాజకీయాల్లో ఎదుగుతూ రాష్ట్ర నాయకుడిగా మారిన తీరు ఈ సినిమా ఇతివృత్తం. ఆయన తీసుకున్న నిర్ణయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, ప్రజల కోసం చేసిన పనులు వంటి వాటిని ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఈ సినిమాలో కళ్ళకు కట్టినట్లు చూపిస్తారట. ముఖ్యమంత్రిగా సాధించిన మైలురాళ్లు, ప్రతిపక్ష నేతగా చేసిన యాత్రలు, నందమూరి కుటుంబంతో ఉన్న అనుబంధం, అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన దాడి, జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అరెస్టు.. ఇలా అన్ని ఎపిసోడ్లు ఉండనున్నాయని తెలుస్తోంది.

# రైతు సమాచారంలో ఆశించిన స్థాయికి చేరని డిజిటల్ సేవలు..!

## సన్నిహిత సమాచారం పైనే అన్నదాత విశ్వాసం..!

పంట ఉత్పాదకత పెరగడంలో, సాగు నిర్ణయాల్లో, స్థిరమైన వ్యవసాయ విధానాల అమలులో వ్యవసాయ సమాచారం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, పాడి రైతులు ఇప్పటికీ ఎక్కువగా సాంప్రదాయ సమాచార వనరులపై ఆధారపడుతున్నారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన ఒక అధ్యయనంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. వరి ఎగుమతి ప్రాంతాల్లో నిర్వహించిన పరిశోధనలో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి.వాతావరణ మార్పులు, పురుగు నియంత్రణ, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, మార్కెట్ ధరల వంటి కీలక విషయాల్లో రైతులు కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారు వంటి వ్యక్తిగత వనరులపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు తేలింది. శాస్త్రీయ వ్యవసాయ సమాచార వనరులు, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వినియోగం ఇంకా ఆశించిన స్థాయికి చేరలేదని అధ్యయనం స్పష్టం చేసింది.

కుటుంబమే ప్రధాన సమాచారం వనరు..

తెలంగాణలో 65 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 68.75 శాతం రైతులు కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచే వ్యవసాయ సమాచారాన్ని ఎక్కువగా పొందుతున్నట్లు తేలింది. పొరుగువారి నుంచి సమాచారం పొందే శాతం కూడా గణనీయంగా ఉంది. అయితే ఈ విధానం వల్ల ఆధునిక "గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (ఉంఖ)" గురించి అవగాహన తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, సమాచారం తరతరాలుగా పరిమిత వర్గాల్లోనే కొనసాగుతుందని అధ్యయనం పేర్కొంది.ప్రభుత్వ వ్యవసాయ అధికారులపై అధిక విశ్వాసం..సాంప్రదాయేతర వర్గాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులపై రైతుల విశ్వాసం అత్యధికంగా ఉన్నట్లు తేలింది. తెలంగాణలో 71.25 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 73.75 శాతం రైతులు వీరి ద్వారా సమాచారం పొందుతున్నారు.తెలంగాణలో రైతు వేదికల ద్వారా, ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల (ఖీఃఐఐ) ద్వారా వ్యవసాయ సలహాలు చేరుతున్నప్పటికీ, కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పూర్తి స్థాయి చేరిక లేనట్లు గుర్తించారు. శాస్త్రవేత్తలు, ఎలంఖీ సంస్థలతో రైతుల ప్రత్యక్ష సంబంధం తక్కువగా ఉండడం కూడా ఒక ప్రధాన లోటుగా పరిశోధన పేర్కొంది. ఎన్జీవోల పాత్ర కూడా పరిమితంగానే ఉంది.

మీడియా వినియోగంలో మార్పులు.. మొబైల్ పై ఆసక్తి...

మాస్ మీడియా వర్గంలో కిసాన్ మేళాలు, వ్యవసాయ ప్రదర్శనలు రైతులకు ప్రధాన సమాచార వేదికలుగా నిలుస్తున్నాయి. ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం ఉండటంతో రైతులు వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.న్యూస్‌పేపర్లు మోస్తరు స్థాయిలో వినియోగంలో ఉండగా, మొబైల్/ఇంటర్నెట్ ఆధారిత సేవలు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ డిజిటల్ వినియోగం కొంత ఎక్కువగా కనిపిస్తోంది.టీవీ వినియోగం పరిమితంగా ఉండగా, రేడియో పూర్తిగా దాదాపు వినియోగంలో లేకపోవడం గమనార్హం. ఇది సమాచార వినియోగంలో డిజిటల్ మరియు విజువల్ మీడియా వైపు రైతులు మళ్లుతున్న సంకేతంగా కనబడుతోంది.మొత్తం వినియోగ ధోరణి..అధ్యయనంలో పాల్గొన్న రైతుల్లో ఎక్కువ మంది (సుమారు 61.88 శాతం) మధ్యస్థ స్థాయి సమాచార వినియోగాన్ని చూపినట్లు తేలింది. తక్కువ స్థాయి వినియోగం 21.87 శాతం ఉండగా, అధిక స్థాయి వినియోగం 16.25 శాతంగా నమోదైంది.

నిపుణుల అభిప్రాయం..

వ్యవసాయ సమాచార వ్యవస్థలో ప్రభుత్వ విస్తరణ సేవలు కీలకంగా ఉన్నప్పటికీ, పరిశోధనా సంస్థలు?రైతుల మధ్య దూరం తగ్గించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ సేవలు, మొబైల్ యాప్స్ మరింత విస్తృతంగా చేరితే మాత్రమే ఆధునిక వ్యవసాయ పద్ధతుల స్వీకరణ పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పరిశోధన ప్రకారం, రైతులు ఇప్పటికీ కుటుంబం, స్నేహితులు వంటి సాంప్రదాయ వనరులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నప్పటికీ, ప్రభుత్వ వ్యవసాయ సేవలు మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వైపు నెమ్మదిగా మార్పు కనిపిస్తోంది. అయితే ఈ మార్పు వేగం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని అధ్యయనం స్పష్టం చేసింది

# ఐ బొమ్మ రవి పొలిటికల్ అనలిస్ట్ అవతారం

హైదరాబాద్ ఏప్రిల్ 24, సినిమాల పైరసీ.. వాటిని తన వెబ్సైట్లో అప్లోడ్ చేయడం.. దానిద్వారా అక్రమంగా డబ్బు సంపాదించడం వంటి వాటిని అలవాటుగా మార్చుకున్న ఐ బొమ్మ రవి.. ఇప్పుడు కొత్త అవతారం ఎత్తాడు. తెలంగాణ పోలీసులు పట్టుకోవడం.. తమదైన స్టైల్ లో ట్రీట్మెంట్ ఇవ్వడంతో అతడు తన ధోరణి మార్చుకున్నాడు. 100 జింకలను తిన్న పులి శాంతి కపోతంగా మారినట్టు.. అక్రమ వ్యాపారానికి.. దందాలకు అలవాటు పడి.. చివరికి పోలీసులకు చిక్కిన రవి.. ఇప్పుడు పొలిటికల్ ఎనలిస్టుగా మారిపోయాడు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో తమిళనాడు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల పట్ల యావత్ దేశం మొత్తం ఆసక్తిగా ఉంది. ఎందుకంటే డిఎంకె కాంగ్రెస్, అన్న డీఎంకే బీజేపీ, టీవీకే పార్టీలు ఇక్కడ పోటీలో ఉన్నాయి. అధికారాన్ని దక్కించుకుంటామని డిఎంకె.. ఈసారి మార్పు స్పష్టంగా ఉంటుందని అన్న డిఎంకె.. ప్రజలు కొత్త తరహా రాజకీయాలను చూస్తారని టీవీ కే నేతలు చెబుతున్నారు రికార్డు స్థాయిలో 91 శాతాన్ని మించి అక్కడ పోలింగ్ నమోదు అయినట్టు వార్తలు వస్తున్నాయి. ఇంకా చాలామంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూ లైన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. సాయంత్రం ఐదు గంటల వరకే పోలింగ్ సమయం ముగియడంతో.. ఆ సమయం నాటికి పోలింగ్ కేంద్రంలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని పోలీసులు ఇస్తున్నారు.పోలింగ్ నేపథ్యంలో రవి ట్విట్టర్లో ఒక ట్వీట్ చేశాడు. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్రా ఎన్నికల్లో అధికార డిఎంకె మరోసారి అధికారాన్ని దక్కించుకునే అవకాశం ఉందట. విజయ్ పార్టీకి 15 నుంచి 20 వరకు ఓటింగ్ లభిస్తుందట. జన నాయకుడు సినిమా విడుదల కాకముందే లీక్ అయింది. దీంతో తమిళ ప్రజల్లో విజయ్ పట్ల సింపతి పెరిగింది. అది కాస్త టీవీకే పార్టీకి ప్లస్ అయిందని రవి భావిస్తున్నాడు.. అతడు చేసిన ఈ ట్వీట్.. సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. మొన్నటిదాకా పైరసీ వ్యాపారం చేశావు.. ఇప్పుడేమో పొలిటికల్ గా మారిపోయావా.. ఏమైనాప్పటికీ నీ విశ్లేషణ వాస్తవ పరిస్థితికి దగ్గరగా ఉందని కొంతమంది అంటుంటే.. మిగతావారేమో ప్రశాంత్ కిషోర్ లాగా నువ్వు కూడా ఒక సంస్థను ఏర్పాటు చేసి.. కోట్లు సంపాదించుకో అంటూ మరి కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు.

# ఇక చైనాకు చుక్కలే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24, ప్రపంచ దృష్టి పశ్చిమాసియా యుద్ధం, శాంతి చర్చలపై ఉంది. దేశ ప్రజల దృష్టి ఐదు రాష్ట్రాల ఎన్నికలు, వాటి ఫలితాలపై ఉంది. ఈ సమయంలో కేంద్రం దేశ సరిహద్దులో మొదలు పెట్టిన ఓ పనిని పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టింది. లద్దాక్‌లో కీలక టన్నెల్ పనులను దాదాపు ముగించబోతోంది. బాల్క్ నుంచిమినామార్గ్ వరకు 13 కిలోమీటర్ల పొడవైన జోజులా పర్వతాన్ని తవ్వుతూ, రోజుకు 4 మీటర్ల వేగంతో పనులు జరుగుతున్నాయి. మే 30 నాటికి మిగిలిన 300 మీటర్లు పూర్తి చేయబోతున్నారు. దీనికి న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ పద్ధతి వాడుతున్నారు.అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు జోజులా పాస్ మంచుతో కప్పిపోతూ, శ్రీనగర్?లద్దాక్ మార్గం మూసుకుపోతుంది. స్థానికులు ఆహారం, మందులు నిల్వ చేసుకుంటారు; సైన్యం ఇంటర్?కంటినెంట్ ప్లాన్లతో స్వయం సమృద్ధిగా ఉంటుంది. ఈ టన్నెల్ పూర్తయితే, 365 రోజులు వాహనాలు, భారీ ఆయుధాలు తరలింపునకు వీలవుతుంది. ప్రస్తుతం 29 కి.మీ./గం వేగం 70 కి.మీ./గం అవుతుంది. దూరం, ఖర్చు గణనీయంగా తగ్గుతాయి.2018 నుంచి చైనా లద్దాక్ భూభాగాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోంది, భారత్ ధైర్యంగా తిప్పికొట్టింది. ఈ ప్రాజెక్ట్ చైనా?పాక్ సరిహద్దుల్లో సైనిక ఉద్దీపనను బలోపేతం చేస్తుంది. హిమాచల్ నుంచి దక్షిణ లద్దాక్‌కు ఆధార మార్గం (నిము?పదుమ్?దార్చా) జోజులాను మరింత కీలకం చేస్తుంది. శింకు లా టన్నెల్ (4.1 కి.మీ., 15,800 అడుగుల ఎత్తు) కూడా హిమాచల్?లద్దాక్ కనెక్ట్‌ను లింక్ చేస్తుంది.ఈ ఇన్‌ఫ్రా పుష్ రక్షణ భద్రతను పెంచడమే కాక, వాణిజ్యం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. బిలాస్పూర్?మనాలీ?లెహ్ రైలు (రూ.1.31 లక్షల కోట్లు), లెహ్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ (రూ.640 కోట్లు)లతో కలిపి లద్దాక్ 'ట్సునామి ఆఫ్ డెవలప్‌మెంట్'కు సాక్షియైంది. రూ.20,660 కోట్లు రోడ్లకు కేటాయించారు. బీఆర్‌వో ప్రాజెక్ట్ విజయక్‌లో లెహ్?చాలుంకా, కార్గిల్?డుమ్గిల్ మార్గాలు మెరుగయ్యాయి.

## బకాయిల వేటలో ప్రజాప్రతినిధుల త్యాగం
## ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాల్లో కోత

హైదరాబాద్, ఏప్రిల్ 24 రాష్ట్రంలోని పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పెండింగ్ బకాయిలను తీర్చేందుకు ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మంత్రులు,ఎమ్మెల్యేల జీతాల్లో 50 శాతం నిలిపివేసి , ఆ నిధులను రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం మళ్లించాలని కేబినెట్ తీర్మానించింది. ఉద్యోగులకు అందాల్సిన బకాయిలపై మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, కేవలం 100 రోజుల్లోపు ఈ సమస్యను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుత గణాంకాల ప్రకారం, సాధారణ ఉద్యోగులకు 6,200 కోట్లు రిటైర్డ్ ఉద్యోగులకు 8,000 కోట్లు ర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మంత్రులు స్వచ్ఛందంగా తమ జీతాల్లో 50 శాతం వదులుకోవడానికి ముందుకొచ్చారు. ఇతర ప్రజాప్రతినిధుల జీతాలను కూడా దీనికి మళ్లించడంతో పాటు, ప్రత్యామ్నాయ నిధుల సమీకరణ మార్గాలను

వెంటనే అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. ఇదే తరహాలో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇటీవల సంచలన నిర్ణయం తీసుకుంది. అక్కడ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తన జీతంలో 50 శాతం, మంత్రులు 30 శాతం, ఎమ్మెల్యేలు 20 శాతం మేర తమ జీతాలను ఆరు నెలల పాటు వాయిదా వేసుకున్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ప్రజలపై భారం పడకుండా, తామే ఆదర్శంగా నిలవాలని అక్కడి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు తెలంగాణలోనూ తీసుకున్నారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవితాంతం చేసిన సేవలకు ప్రతిఫలంగా అందాల్సిన డబ్బు కోసం ఏళ్ల తరబడి వేచి చూడటంపై కేబినెట్ విచారం వ్యక్తం చేసింది. ఆర్థిక వనరులను సమకూర్చుకుని, వచ్చే 100 రోజుల్లోపు పెండింగ్

బకాయిలన్నీ చెల్లించేలా యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ పెద్దలే తమ జీతాలను వదులుకోవడానికి సిద్ధపడటం ద్వారా ఉద్యోగుల్లో నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేస్తున్నారని భావిస్తున్నారు

# ట్రాక్టర్ బోల్తా డ్రైవర్ మృతి





ఏలూరు జిల్లా ఏలూరు జాతీయ రహదారిలో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి వంతెన పై నుండి కిందకు పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం ఏలూరు చింతలపూడి రోడ్డు లో జరిగింది.మృతుడు నందివాడకు చెందిన మందపాటి నాగరాజు గా గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుమొబైల్ సేఫ్టీ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు

# విజయవాడలో నకిలీ అధికారుల అరెస్ట్

విజయవాడలో నలుగురు నకిలీ అధికారులను పోలీసులు అరెస్ట్ చేశారు. పటమటలోని ఓ షాప్ వద్దకు గొల్లపూడికి చెందిన నలుగురు నకిలీ అధికారాలు వెళ్లారు..తాము క్రైమ్ గ్రీవలెన్స్ ఇంటెలిజెన్స్ విభాగం నుంచి వచ్చామని దుకాణంలో తనిఖీలు చేయాలి.. సరకుల నాణ్యత సరిగా లేదని, బరువు తక్కువగా ఉన్నాయని ఫిర్యాదులొచ్చాయంటూ హడావుడి సృష్టించి నగదు డిమాండ్ చేశారు... బాధితుడు అనుమానం తో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని అదుపులోకి తీసుకున్నారు...

# ఆత్మహత్యాయత్నం చేసిన ఆర్టీసీ డ్రైవర్



భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన రవీందర్ అనే డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేసాడు, పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రవీదర్ ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఇప్పటి వరకు నలుగురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

## లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు.. ఒకరు మృతి

తిరుపతి జిల్లా తాల్వాయిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరికొందరికి గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అరెస్టు

స్టేషన్ ఘన్ పూర్ ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంతిమ యాత్రలో పాల్గొనడానికి వెళ్తున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ను పోలీపసులు మార్గమధ్యలో అరెస్ట్ చేసి ఘన్పూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. దాంతో మాజీ మంత్రి రాజయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించారు. అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ ధర్నాకు దిగారు. మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ను విడుదల చేయాలని డిమాండ్ చేసారు.

# పెట్రోల్ ధరలు పెరుగుతాయా.. తగ్గుతాయా ?

ముంబై, ఏప్రిల్ 24, పశ్చిమాసియా యుద్ధం కారణంగా దేశంలో చమురు కొరత నెలకొంది. ఇప్పటికే ఎల్పీజీ ధరను కేంద్రం పెంచింది. యుద్ధం ముగిసే సూచనలు కనిపించడం లేదు. సీజ్‌ఫైర్ కుదిరినా శాశ్వత శాంతి ప్రయత్నాలు ఫలించడం లేదు. మరోవైపు హర్మూజ్‌లో ఇప్పుడు అమెరికా పట్టు సాధించింది. ఈ నేపథ్యలో చమురు ధరలు పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులు పెట్రోల్, డీజిల్ ధరల పెంపు గురించి వ్యాప్తమైన ఆందోళనలను తొలగించారు. ప్రభుత్వ స్థాయిలో అలాంటి ప్రతిపాదనలు లేవని ప్రకటించింది.సోషల్ మీడియాలో పెట్రోల ధరలు రూ.5 నుంచి 10 వరకు ధరలు పెరుగుతాయనే తప్పుడు సమాచారం వ్యాప్తి చెందింది. ఈ వార్తలు వాహనదారులు, వ్యాపారుల్లో టెన్షన్‌కు కారణమయ్యాయి. కేంద్రం ట్విట్టర్ ద్వారా తక్షణ స్పందించి, ఇలాంటి ప్రణాళికలు లేనటి వాస్తవాన్ని ప్రకటించింది.40 ఏళ్లుగా ఇంధన ధరల్లో మార్పు లేకుండా ఉన్న ఏకైక దేశం భారత్. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు 70?80 డాలర్ల మధ్య ఊపందుకున్నా, ప్రభుత్వం పోషక విధానాలతో పౌర భారాన్ని తగ్గించింది. ఈ స్థిరత్వం వాహన రవాణా, వ్యవసాయం, చిన్న వ్యాపారాలకు మేలు చేస్తోంది.ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు 20?30 శాతం పెరిగిన సమయంలో భారత్ ప్రభుత్వం పౌరాభివృద్ధి దృష్ట్యా చర్యలు తీసుకుంటోంది. డీజిల్‌పై వెయ్యి కోట్ల సబ్సిడీ, పెట్రోల్‌పై పన్ను తగ్గించి ధరలను అదుపులో ఉంచింది. దీంతో వీలయినంత తక్కువ ధరలతో పౌరులకు అందిస్తున్నారు.తప్పుడు ప్రచారంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. తాజాగా ప్రభుత్వం ముందస్తు సమాచారంతో అనవసర భయాలను నివారిస్తోంది. ఆర్థిక స్థిరత్వం కోసం ఇంధన విధానం మరింత బలపడుతుందని అంచనా.

# ఏడాది తర్వాత రన్యా రావుకు బెయిల్

బెంగళూరు, ఏప్రిల్ 24, దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కన్నడ నటి రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నటికి.. ఎట్టకేలకు బెయిల్ మంజూరయ్యింది. ఏడాది నుంచి ఆమె బెయిల్ కోసం చేస్తోన్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. ప్రస్తుతం రన్యా రావు పరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్నారు.బంగారం అక్రమ రవాణా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ.. ఏడాది నుంచి జైల్లో ఉన్న కన్నడ నటి రన్యా రావుకు ఊరట లభించింది. కర్ణాటక కోర్టు ఆమెకు బుధవారం నాడు బెయిల్‌ను మంజూరు చేసింది. మొత్తం రూ.102 కోట్ల విలువైన బంగారాన్ని దుబాయ్ నుంచి దేశానికి అక్రమంగా తరలించారనేది ప్రధాన ఆరోపణ. ఆర్థిక నేరాల విచారణ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో రన్యా రావు జైలు నుంచి త్వరలోనే విడుదల కానున్నారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.8 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తుండగా గతేడాది మార్చి 3న కెంపెగౌడ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు రన్యా రావు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ భారీ స్మగ్లింగ్ కేసు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కర్ణాటక సీనియర్ పోలీస్ అధికారి కే. రామచంద్రరావుకు రన్యా రావు సవతి కూతురు. ఈ కేసులో ఆయన పాత్రపై కూడా అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి.ఈ కేసులో ఏడాది నుంచి బెంగళూరులోని పరప్పన అగ్రహారం సెంట్రల్ జైల్లోనే నటి రన్యా రావు ఉన్నారు. ఆమె బెయిల్ కోసం అనేకసార్లు చేసిన ప్రతిపాదనలను కోర్టులు తిరస్కరించాయి. కేసు తీవ్రత దృష్ట్యా హైకోర్టు ఆమె బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. అంతేకాదు, రన్యా రావుపై 'విదేశీ మారక ద్రవ్య రక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ' చట్టం కింద కేసు నమోదయ్యింది. ఈ చట్టం కింద అరెస్టైన వారు తప్పనిసరిగా ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అందుకే గత ఏడాది కాలంగా బెయిల్ కోసం ఆమె చేసిన ప్రయత్నాలు విఫలయమ్యాయి.రూ. 102 కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రన్యా రావు పాత్రపై పక్కా ఆధారాలతో ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. సీనియర్ ఐపీఎస్ అధికారికి ఆమె సవతి కుమార్తె కావడంతో తనను ఎవరూ తనిఖీ చేయరనే ధైర్యంతో బంగారం స్మగ్లింగ్‌కు తెరతీసింది. కేవలం 15 రోజుల వ్యవధిలో రన్యా రావు నాలుగు సార్లు దుబాయ్ పర్యటనకు వెళ్లడం అనుమానం రేకెత్తించింది. దీంతో 2025 మార్చి 3న దుబాయ్ నుంచ తిరిగొస్తుండగా విమానాశ్రయం ఎగ్జిట్ గేట్ వద్ద రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అడ్డుకుని తనిఖీ చేయడంతో గుట్టురట్టయ్యింది. ఏకంగా ఆమె వద్ద 14.2 కిలోల బంగారం బయటపడింది. కమిషన్ కోసం కక్కుర్తిపడి గోల్డ్ స్మగ్లింగ్‌లో భాగస్వామ్యమైనట్టు తేలింది. కిలోకు రూ.4-5 లక్షలు కమిషన్‌గా వచ్చేదని ఈడీ విచారణలో వెల్లడయ్యింది. ఇక, ఈ కేసులో రన్యారావుతో పాటు తెలుగు వ్యక్తి తరుణ్ కొండూరు, బళ్లారికి చెందిన వ్యాపారి సాహిల్ సకారియా జైన్‌లు కూడా ఉన్నారు.

# అనవసర వివాదాలు...

హైదరాబాద్, ఏప్రిల్ 24, మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువంటి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది.స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణరావు.. జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేందుకు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష.. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావరణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది.నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీమ ను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమానాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామారెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవి అందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు తరచూ చంద్రబాబును.. రేవంత్ రెడ్డిని ఇష్టానుసారంగా తిట్టే కేసీఆర్.. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్ళాడు.. ఉద్యమకారులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్థించుకుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బేరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాలలో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్టుగా రైజింగ్ తెలంగాణ ఏర్పడలేదు.

# పక్కా ప్లాన్ తో కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 24 కల్వకుంట్ల కవిత.. మాజీసీఎం కేసీఆర్ తనయగా.. రాజకీయాల్లోకి అడుగు పెట్టిన ఆమె.. ఎంపీగా, ఎమ్మెల్సీగా వ్యవహరించారు. ఇక, ఆ పార్టీతో తెగతెంపులు చేసుకున్నాక.. రెండు రోజుల్లో కొత్తపార్టీకి కూడా రెడీ అయ్యారు. అయితే.. తండ్రి నుంచి తెచ్చుకున్న వారసత్వమో.. లేక స్వతహాగానే.. సంపాయించుకున్న పొలిటికల్ తెలివి తేటలో మొత్తంగా.. ఏదేమైనా.. పార్టీ పెట్టకుండానే.. రాజకీయంగా పరుగులు పెడుతున్నారు. ఏ క్షణాన ఏ పార్టీ నుంచి ఎవరికి స్వాగతం పలుకుతారో.. అన్న చర్చ తెరమీదకు వచ్చిందంటే.. కవిత దూకుడు ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.ఖమ్మం జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లా వరకు కూడా ఇటు బీఆర్ఎస్, అటు కాంగ్రెస్‌కు బలమైన కేడర్ ఉంది. నాయకులు కూడా ఉన్నారు. ఇదేసమయంలో అసంతృప్తితో రగిలిపోతున్న నాయకులకు కూడా కొదవలేని జిల్లాలు కూడా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో అసంతృప్త నాయకులకు కవిత ఆహ్వానాలు పలుకుతున్నారు. ఖమ్మం జిల్లాలో పార్టీలు మారి.. బీఆర్ ఎస్‌లో చేరిన నాయకులు.. తర్వాత కాలంలో పెద్దగా గుర్తింపు పొందలేదు. గత ఎన్నికల్లో టికెట్లు కూడా కోల్పోయారు. ఇప్పుడు అలాంటి వారికి కవిత పెట్టబోయే పార్టీ తురుపు ముక్కగా మారింది. మరోవైపు.. కవితకు వీరే పెద్దదిక్కుగా కూడా మారుతున్నారు.ఆదిలాబాద్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే బోథ్ నియోజకవర్గానికి చెందిన రాథోడ్ బాపూరావు ఇటీవ లేకవిత సమక్షంలో జాగృతి కండువా కప్పుకొన్నారు. నిజానికి సీనియర్ నాయకుడిగా పేరున్న బాపూరావుకు.. గిరిజన సామాజిక వర్గంలో బలమైన కేడర్ ఉంది. గతంలో కాంగ్రెస్ తర్వాత.. బీఆర్ ఎస్.. గత ఎన్నికలకు ముందు బీజేపీ లో చేరిన ఆయన.. తిరిగి మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చారు. పార్టీ అధికారంలో ఉన్నా.. కూడా ఆయనకు గుర్తింపు లేదన్న కారణంతో.. ఇప్పుడు కవిత కు జై కొట్టారు. ఇలాంటి వారి వల్ల తన పార్టీతొందరగా పుంజుకుంటుందన్న ఉద్దేశంతో కవిత సైతం ఆయనకు స్వాగతం పలికారుఈయన ఒక్కరే కాదు..

జిల్లాలోని పలువురు మాజీ బీఆర్ ఎస్ నాయకుల నుంచి ప్రస్తుత కాంగ్రెస్ నాయకుల వరకు కూడా కవిత ఇంటికి క్యూకట్టారని జాగృతి నాయకులు చెబుతున్నారు. ఇక, ఖమ్మంలో మాజీ ఎమ్మెల్యే.. ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉండి.. తర్వాత బీఆర్ ఎస్‌లోకి చేరిన ఉపేంద్రరెడ్డి సైతం కవితకు టచ్‌లోకి వచ్చారు. ఈయన కూడా బలమైన కేడర్ ఉన్న నాయకుడే. పార్టీ ప్రారంభం కాగానే..కండువా కప్పుకొనేందుకు రెడీ అయ్యారు. ఇక, ఈయనతో పాటు.. ఖమ్మానికి చెందిన సీనియర్‌నాయకుడు, మాజీ మంత్రి ఒకరు రెడీగా ఉన్నారన్న చర్చ సాగుతోంది.పార్టీ ప్రారంభించనున్న వేదికపైనే కవిత బలమైన 10 మంది నాయకులకు కండువా కప్పేలా ప్లాన్ చేశారని జాగృతి నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం వారితో చర్చలు కూడా పూర్తయ్యాయని, పార్టీ ఆవిర్భావం రోజు.. వారికి వేదికపైనే తీర్థం ఇవ్వనున్నారని అంటున్నారు. వీరిలో కాంగ్రెస్.. బీఆర్ ఎస్ నాయకులు కూడా ఉన్నారని చెబుతున్నారు. మొత్తంగా.. కేసీఆర్ తనయ.. తన రాజకీయ వ్యూహాలను చాలా సైలెంట్‌గా ముందుకు తీసుకువెళ్తున్నారు. అదేసమయంలో దూకుడుగా కూడా వ్యవహరిస్తున్నారు.

ఐదు లక్షల మంది కోసం ప్లానింగ్

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి కల్వకుంట్ల కవిత రంగం సిద్ధం చేశారు. అత్యంత పక్కా ఫ్రేమ్‌వర్క్ , వ్యూహాత్మక పబ్లిసిటీతో ఆమె తన కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ నెల 25న మేడ్చల్ వేదికగా జరగనున్న పార్టీ ఆవిర్భావ సభను మునుపెన్నడూ చూడని రీతిలో నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ చూసినా కవిత భారీ కటౌట్లు, హోర్డింగ్‌లు కనిపించేలా చేస్తున్నారు. నేటి తరం రాజకీయాల్లో పబ్లిసిటీ పవర్ ఎలాంటిదో తెలుసు కాబట్టి అలాగే ముందడుగు వేస్తున్నారు.తన కొత్త పార్టీ అస్తిత్వాన్ని చాటుకోవడానికి కవిత మేడ్చల్ ఆవిర్భావ సభను ఒక ప్రతిష్ఠాత్మక వేదికగా ఎంచుకున్నారు. గత వారం జరిగిన కేసీఆర్ జగిత్యాల సభ కంటే రెట్టింపు జనాభాను సమీకరించాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు. సుమారు ఐదు లక్షల మందికి పైగా జనాన్ని సమీకరించేలా నియోజకవర్గాల వారీగా బాధ్యతలు పంపిణీ చేశారు. ఖర్చుకు వెనుకాడకుండా, అత్యంత భారీ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ సభ ద్వారా తన రాజకీయ సత్తాను చాటి, రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని ఆమె భావిస్తున్నారు.పార్టీ ప్రకటనకు సమయం దగ్గర పడుతున్నా, ఇప్పటివరకు పార్టీ పేరు కానీ, జెండా రూపకల్పన కానీ లీక్ కాకుండా అత్యంత రహస్యంగా ఉంచడం కవిత వ్యూహ చాతుర్యానికి నిదర్శనం. సభ వేదికపైనే పేరును ప్రకటించడం ద్వారా అటు మీడియాలో, ఇటు ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ జరిగేలా ప్లాన్ చేశారు. కేవలం భావోద్వేగాలతో కాకుండా, పక్కా కార్యాచరణ, విధివిధానాలతో ఈ పార్టీ రాబోతోందని భావిస్తున్నారు. బంధుత్వాల కంటే సిద్ధాంతాలకే పెద్దపీట వేస్తానని ఇప్పటికే సంకేతాలు ఇవ్వడం ద్వారా తన ప్రయాణం స్వతంత్రంగా ఉండబోతోందని ఆమె స్పష్టం చేశారు.రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వ్యక్తిగత అనుబంధాల కంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని కవిత భావిస్తున్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో కేసీఆర్ అనుసరించిన కొన్ని విధానాలను ఆమె తప్పుపట్టడం ద్వారా తన గళం భిన్నంగా ఉంటుందని నిరూపించుకున్నారు. ఆవిర్భావ సభలో ఆమె చేసే ప్రసంగం కేవలం కాంగ్రెస్, బీజేపీలకే కాకుండా, బీఆర్ఎస్ శ్రేణులకు కూడా ఒక బలమైన సందేశాన్ని ఇచ్చేలా ఉంటుందని తెలుస్తోంది. తన తండ్రి నుంచి వారసత్వాన్ని కాకుండా, తనకంటూ ఒక సొంత ముద్ర వేసుకుని, తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా ఎదగాలనుకుంటున్నారు. ఆమె ప్రయత్నాలు ఏ స్థాయిలో ఫలిస్తాయో చూడాల్సి ఉంది.

# నిన్న మల్లారెడ్డి... ఇవాళ జీవన్ రెడ్డి..

హైదరాబాద్, ఏప్రిల్ 24 తెలంగాణ రాజకీయాల్లో మరో భారీ కుదుపు చోటుచేసుకోబోతుందా? బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు వరుసగా ఢిల్లీ బాట పట్టడం వెనుక అసలు వ్యూహం ఏమిటి? నిన్న మాజీ మంత్రి మల్లారెడ్డి, నేడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కేంద్ర మంత్రులతో భేటీ అవ్వడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. మున్సిపల్ ఎన్నికల తర్వాత పార్టీకి అంటీముట్టనట్టుగా ఉంటున్న జీవన్ రెడ్డి, తాజాగా ఢిల్లీలో ప్రత్యక్షమవ్వడం ఆయన పార్టీ మార్పుపై వస్తున్న సంకేతాలకు మరింత బలం చేకూరుస్తోంది.కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసంలో జీవన్ రెడ్డి ప్రత్యక్షమవ్వడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కేవలం ఆయన ఒక్కరే వెళ్తే అది వ్యక్తిగత పర్యటన అనుకోవచ్చు, కానీ ఆర్మూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ నేతలతో కలిసి ఆయన కేంద్ర మంత్రితో భేటీ కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సాధారణంగా వ్యాపార పనుల కోసం అయితే స్థానిక ప్రత్యర్థి పార్టీ నేతలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. కానీ, బీజేపీ నేతలతో కలిసి మంతనాలు జరపడం చూస్తుంటే, ఆయన కాషాయ తీర్థం పుచ్చుకోవడం దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ అధిష్టానంపై ఆయన కొంత అసంతృప్తితో ఉన్నారని, అందుకే గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని అనుచరులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ అగ్రనేతలతో టచ్‌లోకి వెళ్లడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.జీవన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం నిజామాబాద్ జిల్లాలో అత్యంత కీలమైంది. న్యాయవాద వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ఆయన, అనతి కాలంలోనే బలమైన నేతగా ఎదిగారు. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున ఆర్మూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2018 ముందస్తు ఎన్నికల్లోనూ తన పట్టు నిలుపుకుంటూ వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సమయంలో ఆయన అసెంబ్లీలో పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. కేసీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, పార్టీ గళాన్ని బలంగా వినిపించే నేతగా జీవన్ రెడ్డికి పేరుండేది. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల విషయంలోనూ ఆయన దూకుడుగా ఉండేవారు. 2023 ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు మారడం, వ్యతిరేక పవనాలు వీయడంతో ఆయన ఓటమి పాలయ్యారు. అప్పటి నుండి బీఆర్ఎస్ హైకమాండ్‌తో ఆయనకు గ్యాప్ పెరిగిందనే వాదనలు వినిపిస్తున్నాయి.ఒకవైపు మల్లారెడ్డి లాంటి సీనియర్ నేతలు, మరోవైపు జీవన్ రెడ్డి వంటి యువ నేతలు బీజేపీ వైపు చూడటం గులాబీ పార్టీకి పెద్ద దెబ్బేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం, తమ వ్యాపార సామ్రాజ్యాలను కాపాడుకోవడానికి బీజేపీని సురక్షితమైన వేదికగా భావిస్తున్నట్లు కనిపిస్తోంది.వ్యాపార పనుల కోసమే ఢిల్లీకి వెళ్లామని నేతలు చెబుతున్నప్పటికీ, అందులో రాజకీయ కోణం లేదని కొట్టిపారేయలేం.

ముఖ్యంగా ఆర్మూర్ బీజేపీ నేతలతో కలిసి జీవన్ రెడ్డి ప్రహ్లాద్ జోషిని కలవడం, రాబోయే రోజుల్లో నిజామాబాద్ జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయని స్పష్టమవుతోంది.ఏది ఏమైనా, జీవన్ రెడ్డి అధికారికంగా బీజేపీ కండువా కప్పుకోవడం ఇక కేవలం లాంఛనమేనని ఆర్మూర్ రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్న మాట. ఒకవేళ ఆయన బీజేపీలో చేరితే, నిజామాబాద్ రాజకీయాల్లో పాత మిత్రులు కొత్త శత్రువులుగా మారే అవకాశం ఉంది.

# ఆర్టీసీ సమ్మెతో మెట్రో సేవలు

హైదరాబాద్, ఏప్రిల్ 24 ఆర్టీసీ కార్మికుల సమ్మె పిలుపుతో నగరంలో ప్రజా రవాణాకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం , రవాణా సంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాయి. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అద్దె బస్సులను సిద్ధం చేయడంతో పాటు, మెట్రో రైళ్ల రాకపోకల వేగాన్ని గరిష్ట స్థాయికి పెంచారుఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికుల కోసం తొలి రోజు సుమారు 1000 బస్సులను అద్దె ప్రాతిపదికన సిద్ధం చేశారు. వీటిలో 480 ఎలక్ట్రిక్ బస్సులు, 250 అద్దె బస్సులు , 270 ఇతర బస్సులు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిత్యం 30 లక్షల మంది ప్రజలు రవాణాపై ఆధారపడుతుండగా, సమ్మె కాలంలో రద్దీని తట్టుకోవడానికి కనీసం 2000 బస్సులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఎల్బీ నగర్, ఉప్పల్, పటాన్ చెరు వంటి కీలక మార్గాల్లో అధిక సంఖ్యలో బస్సులు నడపాలని నిర్ణయించారు.ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేని తరుణంలో మెట్రో రైళ్లపై ఒత్తిడి పెరుగుతున్న దృష్ట్యా, హైదరాబాద్ మెట్రో రైల్ కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీ సమయాల్లో ప్రయాణికులు ఎక్కువ సేపు నిరీక్షించకుండా ఉండేందుకు రైళ్ల మధ్య సమయాన్ని తగ్గించారు.రద్దీ వేళల్లో (ఉదయం 8:00 ? 10:30, సాయంత్రం 5:00 ? 8:00) ప్రతి 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. నాన్-పీక్ అవర్స్‌లో కూడా ప్రతి 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలును నడపనున్నారు. సమ్మె కాలం మొత్తం 56 మెట్రో రైళ్లు నిరంతరాయంగా సేవలు అందించనున్నాయి.నగరంలో ఎంఎంటీఎస్ సర్వీసులను కూడా పెంచితే సబర్బన్ ప్రయాణికులకు మరింత వెసులుబాటు కలుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు , రోజూవారీ కూలీలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని రవాణా మార్గాలను సమన్వయం చేస్తోంది.మియాపూర్ - ఎల్బీ నగర్ కారిడార్‌లో సాధారణంగా పీక్ అవర్స్‌లో 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు, నాన్-పీక్‌లో 4 నిమిషాల 50 సెకన్లకు ఒక రైలు. ఇప్పుడు రోజంతా 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలుగా ఉంటుంది.

నాగోల్-రాయదుర్గ్ కారిడార్‌లో సాధారణంగా నాన్-పీక్‌లో 5 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు. ఇప్పుడు రోజంతా 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు ఉంటుంది.సాధారణంగా వారపు రోజుల్లో ఉదయం 8 నుండి 10:30 వరకు, సాయంత్రం 5 నుండి 8 వరకు మాత్రమే 56 రైళ్లు నడిపేవారు. నాన్-పీక్ అవర్స్‌లో 44 రైళ్లకు తగ్గించేవారు. సమ్మె కారణంగా ఇప్పుడు ఆ తగ్గింపు ఉండదు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సర్వీసులు పొడిగించే అవకాశాన్ని మెట్రో అధికారులు పరిశీలిస్తున్నారు.

# త్రిశంకు స్వర్గంలో కాళేశ్వరం నివేదిక

హైదరాబాద్, ఏప్రిల్ 24 కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక, దానిపై హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. సహజ న్యాయసూత్రాల ఉల్లంఘన జరిగిందన్న కోర్టు వ్యాఖ్యలతో ఈ నివేదిక భవితవ్యం ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో పడింది. ఒకవైపు బీఆర్ఎస్ శ్రేణులు దీనిని నైతిక విజయంగా భావిస్తుంటే, ప్రభుత్వం మాత్రం న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటూనే తన పట్టు నిలుపుకోవాలని చూస్తోందిహైకోర్టు వెలువరించిన తీర్పును నిశితంగా పరిశీలిస్తే, అది అటు ప్రభుత్వానికి, ఇటు మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావులకు మిశ్రమ ఫలితాలను ఇచ్చింది. కాళేశ్వరం అక్రమాలపై విచారణకు జస్టిస్ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 6ను కోర్టు సమర్థించడం ప్రభుత్వానికి లభించిన ప్రాథమిక చట్టబద్ధ విజయం. అయితే విచారణా చట్టం సెక్షన్ 8బి ప్రకారం, ఎవరినైనా దోషులుగా నిర్ధారించే ముందు వారి వివరణ కోరడం తప్పనిసరి అని, కేసీఆర్, హరీష్ రావుల వాదనలు వినకుండానే కమిషన్ నివేదిక ఇవ్వడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. దీనివల్ల నివేదికలోని చర్యల భాగం ప్రస్తుతానికి అమలు చేయడానికి వీలు లేకుండా పోయింది.ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఆత్మరక్షణలో పడకుండా అటాకింగ్ మోడ్‌లోకి వెళ్లేందుకు రెండు ప్రధాన మార్గాలను పరిశీలిస్తోంది. మొదటి ఆప్షన్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయడం. కమిషన్ ఇప్పటికే సేకరించిన సాక్ష్యాధారాలు, ఇతర అధికారుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకుని, కేవలం నోటీసుల సాంకేతికత ఆధారంగా నివేదికను పక్కన పెట్టడం సరికాదని ప్రభుత్వం వాదించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే న్యాయ నిపుణులతో దీనిపై చర్చలు జరిపారు. క్యాబినెట్ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుని ఢిల్లీ వేదికగా పోరాడాలని ప్రభుత్వం యోచిస్తోంది.ఒకవేళ సుప్రీంకోర్టులో ఊరట లభించకపోతే లేదా ప్రక్రియ వేగవంతం కావాలనుకుంటే ప్రభుత్వం రెండో ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. అది హైకోర్టు సూచించిన లోపాలను సవరించడానికి జస్టిస్ ఘోష్ కమిషన్‌ను పునరుద్ధరించి అదనపు గడువు ఇవ్వడం. నిందితులుగా భావిస్తున్న వారికి అధికారికంగా నోటీసులు ఇచ్చి, వారి వాదనలను రికార్డు చేసిన తర్వాత సవరించిన నివేదికను సమర్పించడం ద్వారా విచారణకు పూర్తిస్థాయి చట్టబద్ధత లభిస్తుంది.ఈ పరిణామాలు తెలంగాణలో రాజకీయాన్ని హీటెక్కించాయి. ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కి తగ్గితే అది రాజకీయంగా బలహీనతగా కనిపిస్తుంది. అందుకే పీసీ ఘోష్ కమిషన్ ద్వారా సేకరించిన సమాచారాన్ని వృధా కానివ్వకుండా, సాంకేతిక లోపాలను సరిదిద్దుకుని ముందుకు వెళ్లడమే రేవంత్ సర్కార్ వ్యూహంగా కనిపిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ నేతలు తమకు వాదన వినిపించే అవకాశం రావడం ద్వారా కాలయాపన చేసే ఛాన్స్ దక్కుతుందని భావిస్తున్నారు. అయితే కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమేనని కోర్టు స్పష్టం చేయడం వల్ల విచారణ నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి కాళేశ్వరం విచారణ ఇప్పుడు ఢిల్లీలోని సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతుందా లేక హైదరాబాద్‌లోనే కొత్త నోటీసులతో పునఃప్రారంభమవుతుందా అనేది ప్రభుత్వ తదుపరి అడుగుపైనే ఆధారపడి ఉంది.

# సేల్స్ టాక్స్ అధికారి ఇంటిపై ఏసీబీ దాడులు

విజయవాడ గవర్నర్పేట సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరిపింది. ఆఫీస్ సబార్డినేట్గా పనిచేస్తున్న కొండపల్లి శ్రీనివాసరావుపై ఏసీబీ కేసు నమోదు అయింది. కొండపల్లి శ్రీనివాసరావు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న అభియోగంపై ఏసీబీ తనిఖీలు జరిపింది. శ్రీనివాసరావు కార్యాలయంతో పాటు.. విజయవాడ వన్టౌన్ పీఎస్ సమీపంలోని శ్రీనివాసరావు నివాసం, ఆయన సోదరుల ఇళ్లలోనూ ఏసీబీ సోదాలు జరిగాయి...

# వన్ మ్యాన్ ఆర్మీయేనా...

హైదరాబాద్, ఏప్రిల్ 24 తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్‌లో వన్ మ్యాన్ 'ఆర్మీ'గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనిపిస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఆయన శ్రమించారు. ఇదే.. ఆయనకు ఎంతో మంది సీనియర్లను కూడా పక్కన పెట్టి.. ముఖ్యమంత్రి పీఠం దక్కేలా చేసిందన్న వాదన ఉంది. ఎన్నికల వరకు రేవంత్ దూకుడును అందరూ సమర్థించారు. బలమైన బీఆర్ ఎస్ పార్టీని నిలువరించేందుకు అందరూ.. అప్పట్లో సర్దుకు పోయారు.కానీ, పార్టీ అధికారం లోకి వచ్చిన తర్వాత కూడా సీఎంగా రేవంత్ రెడ్డి వన్ మ్యాన్ ఆర్మీగా వ్యవహరించడం.. తెలిసిందే. హైడ్రా వంటి కీలక వ్యవస్థను ఆయన తీసుకువచ్చారు. అదేసమయంలో ఆయన రైజింగ్ తెలంగాణ, ఫ్యూచర్ సిటీ వంటివాటిని కూడా తెరపైకి తెచ్చారు. 3 ట్రిలియన్‌ల ఆర్థిక శక్తిగా తెలంగాణను డెవలప్ చేస్తామని కూడా చెబుతున్నారు. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. అభివృద్ధి అనేది.. అందరూ స్వాగతిస్తారు. కానీ, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు రాలాలంటే.. మాత్రం.. కలివిడి ముఖ్యం.నాయకులు ఎవరైనా.. కార్యకర్తలు ఎక్కడైనా కలివిడిగా

ఉంటేనే.. పార్టీ పరంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయంలో రేవంత్ చర్యలు ఆశించినట్టుగా లేవన్నది పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ఒకప్పుడు రేవంత్ రెడ్డిని సమర్థించిన నాయకులు కూడా.. ఇప్పుడు తెరమరుగవుతున్నారు. తమ అభిప్రాయాలను చెబుతున్నారు. తాజాగా జీవన్ రెడ్డి పార్టీని వదిలి వెళ్లిపోయిన తర్వాత.. ఆన్ లైన్ ఛానెళ్లు కొందరు.. సీనియర్లను కలిసినప్పుడు.. రేవంత్ రెడ్డి వ్యవహారంపై వారు సూటిగా స్పందించారు."పార్టీ అంటే.. రేవంత్ ఒక్కరే అనుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు.. మండలస్థాయి నాయకులు కలివిడిగా ఉంటేనే.. నాడు అధికారంలోకి వచ్చాం. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడుందో చెప్పండి." అని సీనియర్ మోస్ట్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఇది ఈయన ఒక్కరి మాటే కాదు.. దాదాపు సీనియర్లుగా ఉన్న అందరి

మాట కూడా ఇదే. ఒకవైపు.. బీఆర్ ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నం చేస్తోందని.. కానీ.. కాంగ్రెస్‌లో ఒకే ఒక్క నాయకుడు అన్నట్టుగా రేవంత్ వ్యవహరిస్తున్నారని పెదవి విరుస్తున్నారు.అందరినీ కలుపుకొని పోవడంలోనూ.. అభిప్రాయ సేకరణలోనూ ఎలాంటి ప్రాధాన్యం లేకుండా పోయిందని ఆక్షేపిస్తున్నారు. "ఆయనకు నచ్చిన వారిని పదవులు ఇచ్చారు. ఇస్తున్నారు" అంటూ? కొందరు వేం నరేంద్రరెడ్డి వ్యవహారాన్ని తెరమీదికి తెస్తున్నారు. ఇలా.. చేయడం వల్ల.. వన్ మ్యాన్ ఆర్మీగా రేవంత్‌ను మెచ్చుకునేవారికి సంతోషమే అయినా.. క్షేత్రస్థాయిలో పార్టీ బలహీన పడిందని ఒకరిద్దరు చెప్పడం విశేషం.

# డంపింగ్ యార్డ్కు వ్యతిరేకంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మహా పాదయాత్ర



హుజురాబాద్ హుజురాబాద్లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్ రద్దు కోసం కొనసాగుతున్న మహా పాదయాత్రలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. పోతిరెడ్డిపేట, వెంకట్రావుల్లి, సిర్సపల్లి గ్రామాల మీదుగా హుజురాబాద్ అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ పాదయాత్రకు గ్రామాల వారీగా అపూర్వ స్పందన లభించింది. పాదయాత్ర మార్గమంతా మహిళలు, రైతులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ప్రజలు తమ సమస్యలను బహిరంగంగా వ్యక్తం చేస్తూ, డంపింగ్ యార్డ్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది ఏదీ లేదని, ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు జరగనీయబోమని స్పష్టం చేశారు. ప్రజలతో కలిసి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ డంపింగ్ యార్డ్ను కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని, కాబట్టి అదే ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు పార్టీ భేదాలు పక్కనపెట్టి ఈ ఉద్యమానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు.

# కేసీఆర్ లో కనిపించని జోష్....

కరీంనగర్, ఏప్రిల్ 24 కేసీఆర్ రాజకీయంగా దెబ్బతిన్నారు. ఆయన బయటకు వస్తే టైగరే.. అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు ఎలివేషన్లు ఇచ్చారు. గతంలో కేసీఆర్ తన మాటలతోనే ఉద్యమాన్ని రగల్చారు. అందుకే అందరూ అంచనాలు పెంచుకున్నారు. కానీ ఆ అంచనాలకు తగ్గట్లుగా స్పీచ్ లేదు.అంతకు మించి ఆయన పై ఆయనకు నమ్మకం తగ్గినట్లుగా స్పీచ్ ఉంది. తెలంగాణ ఉద్యమంలో తానేం చేశానో చెప్పుకునేందుకు ఎక్కువ సమయం తీసుకున్నారు. నమ్మకం లేనట్లుగా .. తానే వస్తానని చెప్పుకునేందుకు ఆసక్తి చూపారు. సీఎం సీఎం నినాదులు చేయించుకోవడం మరింత ఎబ్బెట్టుగా ఉంది.సాధారణంగా కేసీఆర్ సభ అంటే.. ఒక యుద్ధతంత్రంలా ఉంటుంది. కానీ, జగిత్యాలలో ఆయన తన పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పుకోవడానికే ఎక్కువ సమయం వెచ్చించారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ అస్త్రంగా వాడుకుంటున్న 'మేడిగడ్డ' వైఫల్యంపై ఆయన గట్టిగా నోరు మెదపలేకపోవడం.. ఆయనలోని నైతిక స్థైర్యం దెబ్బతిన్నదనే సంకేతాలను పంపింది. ఒకప్పటి వాడివేడి విమర్శలు, వ్యంగ్యాస్త్రాలు ఈ సభలో

పెద్దగా కనిపించలేదు. జనంతో మమేకమవ్వడం కేసీఆర్ శైలి. కానీ ఈసారి సభలో ఆయనకు, ప్రజలకు మధ్య ఒక స్పష్టమైన దూరం కనిపించింది. స్థానిక సమస్యల కంటే, హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న హైడ్రా కూల్చివేతల గురించి జగిత్యాల సభలో మాట్లాడటం ఏ రకమైన వ్యూహమో ఎవరికీ అర్థం కాలేదు.రేవంత్ రెడ్డి తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ మాట్లాడటం వినేవాళ్లకూ ముఖ్యంగా కేసీఆర్ బాహుబలిగా భావించే క్యాడర్ కు కూడా అంత గొప్పగా అనిపించలేదు. సానుభూతి కోసం ఇలా మాట్లాడుతున్నారన్న అభిప్రాయం వస్తుంది. జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించిన తీరు, ఆయనకు ఇచ్చిన ప్రాధాన్యత చూస్తుంటే బీఆర్ఎస్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో కేసీఆరే స్వయంగా అంగీకరించినట్లు అనిపించింది. దశాబ్దాలుగా గెలవని ఒక

సీనియర్ నేతను సేవియర్ అన్నట్లుగా చిత్రించడం ద్వారా, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ చెల్లాచెదురైందనే నిజాన్ని ఆయన ఒప్పుకున్నట్లయింది. పార్టీలో నూతన ఉత్తేజం నింపాల్సిన బాధ్యతను తన భుజాలపై వేసుకోకుండా, మరొకరిపై భారం వేయడం ఆయనలోని నాయకత్వ లోపాన్ని ఎత్తిచూపింది.కేసీఆర్ ఎవర్నీ గట్టిగా విమర్శించలేకపోయారు. ప్రధాన విషయాలనూ చర్చించలేదు. మేడిగడ్డ సమస్య అనుకుంటే.. మోడీని కూడా పట్టించుకోలేదు. సభ తర్వాత కేసీఆర్ మళ్లీ ప్రజల్లోకి వచ్చి నిరంతరం పోరాటం చేస్తారనే ఆశలు కూడా అడియాశలయ్యాయి. బస్సు యాత్రలు లేదా నిరంతర పర్యటనల గురించి ఆయన ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. నాటి ఉద్యమ కేసీఆర్‌లో ఉన్న ఆ పదును, ఆ కసి నేటి కేసీఆర్‌లో కనిపించకపోవడం.. గులాబీ పార్టీ కి ఇంకా కావాల్సిన ఊపు రాలేదని అనిపించేలా చేస్తోంది. ఈ సభకు హరీష్ రావే కాదు.. కేటీఆర్ కూడా హాజరు కాకపోవడం పార్టీలో అంతర్గత పరిణామాల్ని మరింతగా చర్చకు వచ్చేలా చేస్తోంది.

మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బేరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాలలో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్టుగా రైజింగ్ తెలంగాణ ఏర్పడలేదు.

# మత్తోజిపేట లో ఉద్రిక్తత

నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ స్వగ్రామం నర్సంపేట మండలం మత్తోజిపేటలో ఉద్రిక్తత నెలకొంది. శంకర్ గౌడ్ మృతదేహాన్ని కడసారి డిపోకు తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులను కుటుంబ సభ్యులు, కార్మికులు కోరారు. మరోవైపు, శంకర్ గౌడ్ నివాసానికి చేరుకునేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసారు. శంకర్ గౌడ్ నివాసం వద్ద కార్మికులు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

# శంకర్ గౌడ్ మృతి పట్ల ఎంపి ఈటల సంతాపం

సికింద్రాబాద్ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదానం చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. . హక్కుల సాధనలో ఒక కార్మిక బిడ్డను కోల్పోవడం యావత్ సమాజానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికినా ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.ఈటల మాట్లాడుతూ కార్మిక సోదరులారా.. ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కావు. మరణం నిశ్శబ్దాన్ని మిగిలిస్తుంది, కానీ మన పోరాటానికి కావాల్సింది సజీవమైన గొంతుక. మన పోరాటం గెలవాలంటే మనం సజీవంగా ఉండి పోరాడాలి. ప్రాణాలు తీసుకుని కుటుంబాలను అనాథలు చేయకండి, ధైర్యంగా ఉండి మన హక్కుల కోసం కలిసి పోరాడుదామని అన్నారు.పభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడాలి. శంకర్ గౌడ్ మరణానికి బాధ్యత వహిస్తూ, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలి. లేని పక్షాన.. గత ప్రభుత్వానికి పట్టిన గతే మీకు పడుతుంది. ఇప్పటికైనా చర్చలు జరిపి, కార్మికులకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను కల్పించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు..

# ఇది రేవంత్ సర్కార్ చేసిన హత్యే

## శంకర్ గౌడ్ మృతిపై కేటీఆర్

## కోటి రూపాయల పరిహారం చెల్లించాలి

హైదరాబాద్ వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

ఆర్టీసి సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ గారి పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య. పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసి కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణం. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ రి కుటుంబసభ్యులు, ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని అన్నారు.

కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలి. అలాగే శంకర్ గౌడ్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.ఆర్టీసి కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసి కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోంది.ఆర్టీసిని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసి కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు.

రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసి డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుంది. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు. ఆర్టీసి కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని అన్నారు.

## రెన్యూ ప్రాజెక్టు వైయస్ .జగన్ ప్రభుత్వ కృషికి ఫలితం

విశాఖపట్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి తన పాత క్రెడిట్ చోరీ అలవాటును బయటపెట్టుకున్నారని మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీరీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ ఎద్దేవా చేశారు. అనకాపల్లి జిల్లాలో రెన్యూ సోలార్ సంస్థకు సీఎం చేసిన శంకుస్థాపనపై ఆయన స్పందిస్తూ.. ఈ ప్రాజెక్టు వైయస్ .జగన్ ప్రభుత్వ కృషికి ఫలితమని స్పష్టం చేశారు. 2023 గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలనే ఇప్పుడు చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నారని మండిపడ్డారు.పారిశ్రామిక వేదికను పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చేలా వాడాల్సింది పోయి, వైయస్.జగన్ పై రాజకీయ విమర్శలు చేయడం బాబు దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. హత్యా రాజకీయాలకు పేటెంట్ హక్కు ఉన్న చంద్రబాబు, నేడు వైయస్. జగన్ వ్యక్తిత్వ హననానికి దిగడం విడ్డూరంగా ఉందన్నారు. రెండేళ్ల కూటమి పాలనలో ఒక్క కొత్త పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయిన చంద్రబాబు, జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అభివృద్ధిపై ఫోబియాతో మాట్లాడుతున్నారని.. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకుని ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు.

## పోలీసుల ముందే గంజాయి బ్యాచ్ హల్ చల్

మేడ్చల్ మేడిపల్లి పిఎస్ పరిధి బోడుప్పల్ కమాన్ వద్ద గంజాయి బ్యాచ్ హల్చల్ చేసింది. గురువారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు బోడుప్పల్ కమాన్ వద్ద నుండి వెళ్తున్నవారిని అడ్డుకొని బెదిరింపులకు పాల్పడుతూ గొడవలకు దిగుతున్నారు. పోలీసులు సమాచారం తెలిసి వచ్చినా గంజాయి బ్యాచ్ బయపడలేదు. వారికి నచ్చచెప్పేందుకు చూసిన పోలీసుల పైకి తిరుగుబాటు చేశారు. మేడిపల్లి పిఎస్ పరిధిలో అనేక ప్రాంతాలలో ఇలాంటి గంజాయి గ్యాంగ్ లు ఉన్నాయని, గంజాయి గ్యాంగ్ పోకిరీల ఆగడాలను కట్టడిచేయాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

## మే నెలలో శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మే నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు.వివరాలు ఇలా ఉన్నాయి.మే 1న శ్రీ గోవిందరాజస్వామివారి పొన్నకాల్వ ఉత్సవం జరుగుతుంది.మే 8, 15 తేదీల్లో శుక్రవారాల్లో సాయంత్రం 6 గంటలకు శ్రీ ఆండాళ్ అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్తారు.మే 9న శ్రవణ నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీభూ సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహిస్తారు.మే 12న హనుమజ్జయంతి జరుపుకుంటారు.మే 18న రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ పార్థసారథి స్వామివారు మాడ వీధుల్లో ఊరేగుతారు. అదే రోజు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు.మే 21 నుండి 30వ తేదీ వరకు నమ్మాళ్వార్ ఉత్సవాలు జరుగుతాయి.మే 22న శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది.మే 23 నుండి 31 వరకు శ్రీ గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, 23న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.మే 27న గరుడవాహనం, మే 30న రథోత్సవం నిర్వహిస్తారు.మే 31న చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు బీజేపీ నాయకుల ధర్నా

వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ఘటనపై ధర్నా నిర్వహించారు. శంకర్ గౌడ్ మృతి ఆత్మహత్య కాదు, ప్రభుత్వ హత్య అని ఆరోపిస్తూ ప్రభుత్వం వెంటనే దిగివచ్చి ఆర్టీసీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. శంకర్ గౌడ్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. దీంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి

హైదరాబాద్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముషీరాబాద్ ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలిపారు. అయన మాట్లాడుతూ కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయ సమ్మతమైంది.. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకండని అన్నారు. యావత్ సమాజం, అన్ని రాజకీయ పక్షాలు, ప్రజలు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలి. శంకర్ గౌడ్ ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్య. అని అన్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం. చాలా రాష్ట్రాల్లో ఇది జరిగింది. శంకర్ గౌడ్ ఆత్మబలిదానం తరువాత ప్రభుత్వంలో చలనం రావాలి. కార్మికులు తొందరపాటు చర్యలకు పాల్పడవద్దు. పోరాడి డిమాండ్లు సాధించుకుందాం. మీకు అండగా గతంలో ఉన్నాం. ఇప్పుడు ఉంటాం. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి ఒక్కటి కూడా నిరవేర్చలేదు. శంకర్ గౌడ్ మరణానికి ప్రభుత్వమే కారణం. చర్చలు జరగాలి. చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం చేయాలి. ఉద్యోగులు చాలా ఆవేదనలో ఉన్నారు. పక్క రాష్ట్రంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకముందు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకలా ప్రవర్తిస్తే ఎలా అని ప్రశ్నించారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నెల్లూరు సీతారాంపురం మండలం గంధం వారి పల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లలకు అందుతున్న పోషకాహారం, హాజరు నమోదు, పరిశుభ్రత, సౌకర్యాలను ఆయన పరిశీలించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సేవలు మరింత మెరుగుపర్చాలని, నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు.ముందుగా మారంరెడ్డి పల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్ జలధారకార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా జరుగుతున్న పనులపై ఆరాదీశారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె పై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

### డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

### ఆత్మహత్యలు వద్దు.. పోరాడి సాధించుకుందాం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

### కార్మికుల సమ్మెకు మద్దతుగా సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో

హనుమకొండ : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని,సమ్మె పై మొండి వైఖరి వీడాలని,ఈ విషయంలో సమ్మెపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు హనుమకొండలోని కాళోజి సెంటర్ లో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు.




ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆగిపోయిన రెండు వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కార్మికుల ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యం అని, సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రైవేటు డ్రైవర్ల ప్రయోగం ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని, సమ్మెను అణచివేసేందుకు ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని అన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులకు సంబంధించిన సంక్షేమ చేశారు గత ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, అదేవిధంగా ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆర్టీసి కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్ ఎ స్టాలిన్, వుట్కూరి రాములు, కర్రే లక్ష్మణ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, వేల్పుల సారంగపాణి, గుంటీ రాజేందర్, అలువాల రాజు, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మామునూరి దామోదర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## హనీ ట్రాప్ కేసు నిందితులు కోర్టుకు




అనంతపురం హనీ ట్రాప్ కేసులో అరెస్ట్ అయిన నలుగురిని పోలీసులు కోర్టు లో హాజరు పరిచారు. ఏ 2 రాజేష్ తో సహా మిగిలిన మహిళలను అరెస్ట్ చేసి కోర్టు కు తరలించారు. అరెస్టుల సంఖ్య ఐదుగురికి పెరిగింది. మాజీ ఉపసర్పంచ్ నరేంద్ర రెడ్డి అరెస్ట్ కూడా త్వరలో చూపించే అవకాశం వుంది.

# ఆత్మహత్యలొద్దు.. తెగించి పోరాడుదాం

### ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకుంటే పతనం తప్పదు

### యూనియన్లంటే పాలకులకు భయమెందుకు

### ప్రజారవాణాను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర

### చట్టపరమైన సమ్మెపై నిర్బంధాలు ఆపండి

### డిమాండ్లు పరిష్కరించేవరకు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటాం

### శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, తెగించి పోరాడి హక్కులను సాధించుకుందామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ ఔట్ గేట్ నుంచి ఇన్ గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి బస్టాండు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకోవడం పాలకుల వినాశనానికి నాంది పలికే ప్రమాదం ఉందని, గత ప్రభుత్వ తప్పిదమే ప్రస్తుత ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. కార్మిక యూనియన్లంటే పాలకులకు ఎందుకు అంత భయమని, హక్కుల కోసం పోరాడే గొంతులను నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజారవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఉద్యోగులను ప్రభుత్వంలో




విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు, వేతన సవరణ, పనిభద్రత, బకాయిలు, పనిభద్రత, కొత్తబస్సుల కొనుగోలు తదితర డిమాండ్లు ప్రభుత్వానికి సాధ్యం కానివికాదని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ చట్టబద్ధంగా సమ్మె చేస్తుంటే అరెస్టులు, అక్రమ నిర్బంధాలు ఎందుకు విధిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుండా రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను తీసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు తాము ఆర్టీసీ కార్మికులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తక్షణమే ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, మిర్యాల రంగయ్య, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, కె రత్నకుమారి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి,, నాయకులు ఎర్రబెల్లి శంకర్, గుమ్మడెల్లి దుర్గయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, యూసుఫ్, సత్యనారాయణాచారి, షాహీన్, క్లైసర్, మేదిని లక్ష్మి, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మరోసారి మోసగించకండి: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు ల పై చిన్న చూపు తగదుగురువారం కురిసిన అకాల వర్షాల కు నష్ట పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి.జిల్లా కలెక్టర్, జిల్లా నియోజకవర్గ వ్యవసాయ అధికారులతో ఫోన్ లో మాట్లాడిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.గురువారం వడగండ్ల వర్షాల కు పంట నష్టం పై ప్రభుత్వం కు నివేదిక పంపాలని అధికారులకు ఆదేశించిన హరీష్ రావు.రైతు బంధు ఇవ్వక,పంట నష్టం పరిహారం ఇవ్వక అన్నదాత లను ఆగం చేస్తున్న ప్రభుత్వంగతం లో ముగ్గురు మంత్రులు వచ్చి దెబ్బ తిన్న పంటలను పరిశీలించిన నేటి వరకు ఒక్క రూపాయి పరిహారం అందించలేదు,ఐదు విడుతల్లో పంట నష్ట పరిహారం ఇవ్వకుండా రైతు లకు తీవ్ర అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.బడ్జెట్ లో పెట్టి పంట బీమా ఇవ్వకుండా రైతు లను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుంది.ఇప్పటికి వడగండ్ల వానలతో ఐదు సార్లు,ఒక సారి తుఫాన్ తో పంట నష్టం జరిగిందిఆరు విడుతల్లో పంట నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపు చూడటం పై మండిపడ్డ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.రైతులు అధైర్య పడొద్దు..మీకు అండగా నేను ఉన్నగురువారం కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వాన లతో జరిగిన పంట నష్టం పై మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేసారు. అన్నదాతలు ఆందోళన చెందొద్దు అధైర్య పడొద్దని రైతులకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. జరిగిన నష్టం పై జిల్లా కలెక్టర్, జిల్లా మరియు నియోజకవర్గ వ్యవసాయ అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. సిద్దిపేట అర్బన్ మండలం లో ఎక్కువ నష్టం జరిగిందని తన దృష్టి కి వచ్చిందని, సిద్దిపేట నియోజకవర్గం ఎక్కడెక్కడ పంట నష్టం జరిగిందో అయ గ్రామాల్లో క్షేత్ర స్థాయి లో నష్ట పోయిన పంటను పరిశీలించి ప్రభుతత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు. అకాల వర్షాలకు చేతికి వచ్చిన పంట నేల పాలయిందని రైతు లు ఆందోళన లో ఉన్నారని రైతు లను అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

## మాజీ ఎంపివిజయసాయి రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు



హైదరాబాద్ ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఇడి తనిఖీలు మరోసారి జరిగాయి. జూబ్లీహిల్స్ లోని మాజీ ఎంపి విజయసాయి రెడ్డి నివాసంలో సోదాలు జరిగాయి. శుక్రవారం నాడు ఈడీ అధికారులు విజయసాయిరెడ్డిని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్ కేసులో కీలక ఆధారాలు సేకరిస్తున్నారు. 2019-24 మధ్య లిక్కర్ పాలసీలో అవకతవకలు వున్నట్లు కేసు నమోదయింది. షెల్ కంపెనీల ద్వారా మనీలాండరింగ్, డబ్బు మళ్లింపు, ఇతర ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసినట్లు సమాచారం.

## ప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ పదవికి రాజీనామా..




డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ దేవరకొండ ప్రసాద్ సంచలన ప్రెస్ మీట్.ఏపీ డీజీపీ ఇచ్చిన మెమోకి లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చి అనంతరం తన డి.ఎస్.పి గా పనిచేస్తున్న పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేశారు.విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్లో తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు వ్యవహారంపై తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు అని ఆ ఫిర్యాదులో వివరాలను మీడియాకు వివరిస్తూ తన పదవికి రాజీనామా చేశారు.

## జూబ్లీ ఫ్యాషన్ ఇన్స్టిట్యూట్ కార్యక్రమంలో సినీనటి లయ సందడి

పంజాగుట్ట టూరిజం ప్లాజా లో నిర్వహించిన జూబ్లీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ . "జూబ్లీ ఫోరెమా 7" కార్యక్రమం సినీనటి లయ హాజరుతో మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. సంస్థ వ్యవస్థాపకులు కీర్తిశేషులు జయకృష్ణ గారి జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లయ, మొదటి మరియు రెండవ సంవత్సరం డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అంతేకాకుండా, ఆమె స్వయంగా ర్యాంప్ వాక్ చేసి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా లయ మాట్లాడుతూ, "మనిషి మాట్లాడకముందే అతని డ్రెస్సింగ్ స్టైల్ అతని వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది. ప్రతి డ్రెస్ ఒక ఎమోషన్ను మోస్తుంది. అలాంటి సృజనాత్మకతతో ముందుకు వస్తున్న విద్యార్థులు నిజంగా అదృష్టవంతులు" అని అన్నారు.కార్యక్రమంలో జూబ్లీ విద్యార్థులు రూపొందించిన వినూత్న డిజైన్లతో ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ప్రముఖ మోడల్స్ ఆ డిజైన్లను ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.అదేవిధంగా, విజయవాడలో జూబ్లీ ఇన్స్టిట్యూట్ కొత్త బ్రాంచ్ను లయ మరియు వారి కుటుంబ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మేఘన అధ్యక్షత వహించగా, విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.మొత్తం కార్యక్రమం వినూత్నంగా, ఆదర్శప్రాయంగా సాగి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

# నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పథకాలపైన శిక్షణ తరగతులు




సిద్దిపేట ప్రతి ఒక్క విద్యార్థి తమలోని నైపుణ్యాలను గ్రహించి విద్యా మరియు ఎంచుకున్న రంగం లో ఉపాధి అవకాశాలను సాధించి ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల విద్యార్థులకు జిల్లా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పథకాలపైన జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శిక్షణ తరగతులను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక- 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా సంక్షేమ వారోత్సవాలలో యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, వారిలో ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు తీసుకువచ్చిందని తెలిపారు.జిల్లాలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్న మీరందరూ ఈ నైపుణ్య అవగాహన సదస్సులో 10వ తరగతి తర్వాత ఏది చదవాలి తొందరగా ఉపాధి కల్పించడానికి ఎలాంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలని పూర్తి సమాచారాలను ఇక్కడ మీకు అందించడం జరుగుతుందనీ ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సిద్దిపేట, కుకునూరు పల్లి, దుబ్బాక లో ఐటిఐ లలో యువతకు ఉపాధి అందించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభించి కొత్త కోర్సులను తీసుకువచ్చింది కొత్తగా హుస్నాబాద్ లో సైతం ఐ టి ఐ సెంటర్ మంజూరు అయిందని వచ్చే అకడమిక్ ఇయర్ వరకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో చేరడం ద్వారా తక్కువ సమయంలో మంచి ఉపాధి పొందవచ్చని ఇందులో ఇంజనీరింగ్ వాళ్లకు లేనన్ని ఉపాధి అవకాశాలు ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలోను విద్యార్థులకు లభిస్తాయని సూచించారు. 10 వ తరగతి తర్వాత ఇంటర్ డిగ్రీ లాంటి కోర్సులు కాకుండా నైపుణ్య రంగంలో త్వరగా ఉపాధి కల్పించుకోవడం కోసం అనేక కోర్సులు ఉన్నాయని, ఉద్యోగ అవకాశాలు తోపాటు పై చదువులు చదువుకునేందుకు సైతం ఈ కార్యక్రమంలో క్లుప్తంగా తెలుసుకోవాలని సూచించారు.టెక్నికల్ స్కిల్స్ నేర్చుకుని పట్టణాల్లో సైతం పలు కోర్సులు పూర్తిచేసి ఉపాధి పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, జిఎం ఇండస్ట్రీస్ గణేష్ రామ్, డిడబ్ల్యూఓ శారద, డిబిసిడిఓ సయ్యద్ రఫీ, డిఎస్సీడిఓ హమీద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి విజయ్ భార్గవ్, ఇర్కోడ్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రామానుజ, అడిషనల్ డిఆర్డీఓ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న ఆలయంలో..డీజీపీ ప్రత్యేక పూజలు

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం గార్డ్ ఆఫ్ ఆనర్, సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు.తరువాత స్వామివారి మండపంలో అర్చకులు వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం,లడ్డు ప్రసాదం చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ శ్రీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించండి

## జనగణనపై ఆర్‌జీఐ కీలక ఆదేశాలు

### గృహ గణనలో సైనిక స్థావరాల వంటి ప్రత్యేక ప్రాంతాలను చేర్చకూడదు

న్యూ డిల్లి ఏప్రిల్24; జనగణనపై భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీఐ) కీలక ఆదేశాలు జారీ చేశారు. స్వేచ్ఛాయుత జనగణన నిర్వహణకు ఆటంకం కలిగించేలా బెదిరింపులు లేదా భయపెట్టే చర్యలకు గురయ్యే అవకాశం ఉన్న సమస్యాత్మక గ్రామాలు, నివాస ప్రాంతాలు, వర్గాలను గుర్తించాలని జిల్లా మేజిస్ట్రేట్లు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న గృహ గణనలో సైనిక స్థావరాల వంటి ప్రత్యేక ప్రాంతాలను చేర్చకూడదని కూడా ఆర్‌జీఐ సూచించారు. జనగణన కోసం పాన్-ఇండియా హెల్ప్‌లైన్ నంబర్ 1855 కూడా ప్రారంభించినట్లు గుర్తు చేశారు. దీంతో పాటు జనగణనకు సంబంధించి పలు కీలక సూచనలు చేస్తూ భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ నారాయణ్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు.



"స్వేచ్ఛాయుత జనగణన నిర్వహణకు ఏదైనా బెదిరింపు, భయపెట్టే చర్య లేదా ఆటంకానికి గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలు/చిన్న గ్రామాలు/నివాస ప్రాంతాలు, వర్గాలను గుర్తించాలి. ఇందుకోసం రెవెన్యూ గ్రామాల వారీగా కసరత్తు నిర్వహించాలి. అధికారులు తమ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి స్థానిక గ్రామ అధికారులు, పట్వారీలు, లేఖ్‌పాల్‌లు, తలట్టిలు, గ్రామ పరిపాలనా అధికారులను సంప్రదించి ఈ ప్రక్రియ చేపట్టాలి. ఈ జాబితాను ఖరారు చేసే ముందు స్థానిక పోలీసు అధికారులు (హెచ్‌ఓ), బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (బీడీఓ) వంటి పౌర అధికారులను కూడా సంప్రదించాలి. ఇంకా బెదిరింపు లేదా భయపెట్టే చర్యలు, నేరాలకు నాయకత్వం వహించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించాలి. ఈ ప్రక్రియ చేసేటప్పుడు గత ఘటనలు, ప్రస్తుత అనుమానాలు రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. ప్రధాన జనగణన అధికారి (సీజీఓ) అటువంటి సమాచారాన్ని క్రోడీకరించి, వరుసగా మొత్తం జిల్లాలోని ప్రమాదకర ప్రాంతాల మ్యాపింగ్‌ను ఖరారు చేయాలి."

# ఆర్టీసీ సమ్మెలో విషాదం చాలా బాధాకరం

### అధికార పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే ప్రకటించాలి

### ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాటి కృష్ణ డిమాండ్.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24 మంగపేట** బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు,ఆదేశాల మేరకు మంగపేట గ్రామ కమిటీ అధ్యక్షులు నూనె లింగయ్య,ఆధ్వర్యంలో మంగపేటలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేయునైనది. ఈ సమావేశమునకు,

జిల్లా నాయకులు తాటి కృష్ణ,ముఖ్యఅతిథిగా హాజరై,నిన్న అనగా ఏప్రిల్ 23 గురువారం రోజున ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా నర్సంపేటకు చెందిన శంకర్ గౌడ్,అనే వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడి 80 శాతం గాయాలతో కాలి ప్రాణాలు వదలడం చాలా బాధాకరం తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ వారు సమ్మె చేస్తుంటే హేళనగా చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ విషయంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తాటి కృష్ణ మాట్లాడుతూ దయచేసి ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడి రోడ్డున పడకండి, నిజాయితీగా ఏంతవరకు అయినా పోరాడి సాధించుకోవాలి తప్ప బలిదానాలు చేసుకోవడం వద్దు అని చెప్పారు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు చేయడం. చేతగానప్పుడు మేనిఫెస్టోలో ఎందుకు చేర్చాలి ఆరోజు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆర్టీసీ సంస్థ గురించి,ఐదు, అంశాలు చేర్చడం జరిగింది.



1 ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తి చేసి రెండు పిఆర్సి బకాయిలు వెంటనే చెల్లిస్తాం.

2 వచ్చే పిఆర్సి పరిధిలోకి టీఎస్ ఆర్టీసీ కార్మికులను చేరుస్తాం.

3 రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు సదుపాయాలు కల్పిస్తాం.

4 ఆర్టీసీ బస్సులను అదునీకరించి విస్తరిస్తాం అదు నాతనమైన సౌకర్యాలతో కొత్త సర్వీసులు ప్రారంభిస్తాం.

5 ఆర్టీసీ యూనియన్ పునరుద్ధనకు అనుమతిస్తాం.

అని ప్రకటించటం జరిగింది. ఈ విషయంలో ప్రభుత్వం పూర్తి విఫలమైంది,ఇకనైనా ప్రభుత్వం ఒంటెద్దు పోకట మాని,ఆర్టీసీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలనీ, శంకర్ గౌడ్ కుటుంబానికి,ప్రగాడ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబానికి కోటి రూపాయలు,ఎక్స్ గ్రేషియా చెల్లించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, బిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు తాటి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు,చిట్టి మల్ల సమ్మయ్య,గ్రామ అధ్యక్షులు నూనె లింగయ్య,మండల నాయకులు దంతన పెల్లి నరేందర్, ఎండి అన్వర్ ఎండి భుట్టో,బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,గాదె శ్రీనివాస్,ఎండి అయుబ్,ఎండి రహీం, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ,పూసల నరసింహారావు మాజీ ఎంపీటీసీ మూగల రమేష్,రాము, జవంగుల రవీందర్, బిల్పాటిభాస్కర్,తదితరులు,పాల్గొన్నారు.

# కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శిగాపడమటి జగన్మోహన్ రెడ్డి



హైద్రాబాద్(భువనగిరి)ఏప్రిల్ 24;భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు ప్రకటించారు యాదాద్రి భువనగిరి జిల్లా కు చెందిన పడమటి జగన్మోహన్ రెడ్డిని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు జగన్మోహన్ రెడ్డి విద్యార్థి దశలో ఏబీవీపీ లో చురుకైన పాత్ర పోషించి తనకంటూ గుర్తిము పొందారు.అలాగే యువ మోర్చా కమిటీలో కూడా ఆయన కీలక బాధ్యతలు చేపట్టి పార్టీలో తనకంటూ గుర్తింపు పొందారు ఆయన సేవలను గుర్తించిన బిజెపి పార్టీ రాష్ట్ర కమిటీ జగన్మోహన్ రెడ్డిని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించింది జగన్మోహన్ రెడ్డి నియామకం పట్ల యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పలువురు బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు .

# నిరుపేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు

### ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించింది.

### రోహిర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్

**ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి ఏప్రిల్ 24 రొయ్యూరు**గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏటూరు నాగారం మండలం రోహిర్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ మంత్రి డా.. ధనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాలు వారి పూర్తి సాకారం తో

న్యూ వన్ అపోలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (ఏటూరు నాగారం) మరియు అజార హాస్పిటల్ (వరంగల్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరం గ్రామ ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించిందినీ గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ అన్నారు ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ముఖ్యంగా పరీక్షలను ఉచితంగా నిర్వహించడం విశేషం. అదనంగా థైరాయిడ్, కొలస్ట్రాల్ వంటి ముఖ్యమైన రక్తపరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచారు.





ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ నరసింహ, డాక్టర్ నీరజ పొన్నాల, డాక్టర్ శ్రీరాం మహేష్ పాల్గొని రోగులను పరిశీలించి తగిన వైద్య సూచనలు అందించారు. వారి సేవలు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయి.

కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ తరఫున పున్నం రాజకుమార్, కుల్లా అనిల్ కుమార్ సమన్వయం చేపట్టారు.

గ్రామ ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మరింతగా నిర్వహించాలని నిర్వాహకులను కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఈ మెగా వైద్య శిబిరం ఆదర్శంగా నిలిచింది. నిరుపేద ప్రజలకు ఉచితంగా మెరుగైన చికిత్స అందించిన వైద్యులు, సిబ్బంది, నిర్వాహకులు మరియు సహకరించిన గ్రామ ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకుదారి మహేష్, గ్రామ కార్యదర్శి వీరు నాయక్, వార్డు సభ్యులు కొండగొర్ల తిరుపతి, గజ్జల అంకుల్, సోదరి సరస్వతి, రాజేష్, డోగిరి రామాంజలి, రాజశేఖర్, ఆకుదారి వెంకటమహాలక్ష్మి, డోంగిరి రఘు, దుర్గం స్వప్న, సూరం రమేష్, కొయ్యల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జిమిడా రవి, డోంగిరి మధుబాబు, దుర్గారావు, బంటి, కవిరి మండయ్య, అల్లంల చంటి, అల్లమల మహేష్, మూలకాల శ్రీను, కారోబార్ శంకర్, ఆకుదారి రమేష్, డోంగిరి రాంబాబు, గట్టయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలకు నష్టపరిహారం చెల్లించకపోతే ప్రభుత్వ పతనం తప్పదు

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి దావూద్ ప్రభుత్వానికి హెచ్చరిక



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24 ఏటూరు నాగారం** గత రెండు రోజులుగా కురుస్తున్నా అకాల వర్షానికి నష్టపోయిన పంట పొలాలను సిపిఎం మండల బృందం ఈరోజు శివపురం, గోగుపల్లి ,చిన్న బోయినపల్లి గ్రామాల్లో పంట పొలాలను సందర్శించారు

అనంతరం ప్రభుత్వాన్ని ఉద్దేశించి దావూద్ మాట్లాడుతూ నిన్న మొన్న అధిక గాలులతో కూడిన వర్షంతో రైతుల వరి పొలాల్లో దాన్యం రాలిపోయి మొత్తం పడిపోయాయని కోసిన రైతుల పరిస్థితి చూస్తే బరకాలు గాలులకు లేచిపోయి వాళ్ళ పరిస్థితి వర్ణాతితం అన్నారు.

అదేవిధంగా సంవత్సరం మే 14 .2025 న గోగుపల్లి అనే గ్రామంలో పక్కనే ఉన్న వాగులో ధాన్యం ఎండబెట్టుకుంటే అనుకోకుండా హఠాత్తుగా వర్షం పడడంతో49 మంది రైతుల ధాన్యం వాగులో కొట్టుకుపోయయని ఇదే టైంలో రాష్ట్రవ్యాప్తంగా కూడా నష్టం జరిగితే ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గం 2025 మే 28న సమావేశమయ్యి నష్టాన్ని అంచనా వేసి రాష్ట్రవ్యాప్తంగా 51 కోట్ల 50 లక్షలు. ములుగు జిల్లాలో ఐదు కోట్ల 73 లక్షలు వెంటనే మంజూరు చేసి సంవత్సరం గడిచిన రైతుల ఖాతాల్లో ఒక చిల్లిగవ్వ పడలేదంటే దీన్ని ఏమంటారు అని దావూద్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు.

ప్రభుత్వం ఇలాంటి నష్టపరిహారం చెల్లించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారం రైతులు ఆశ్రయిస్తున్నారని ఇదే సందర్భంగా ప్రభుత్వం తడిసిన ధాన్యం పేరుతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు ఒప్పుకోవడం లేదని ఐదు కేజీల నుండి 15 కేజీల వరకు కోతలు విధిస్తున్నారని ఎలాంటి కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు నిర్వహించాలని కూడా అన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని ఎన్ని పోరాటాలు చేసిన రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో రైతులు ప్రభుత్వంపై నిరసన జ్వాలలు వెళ్లిబుచ్చుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం నిన్న. మొన్న కురిసిన వర్షాలకు నష్టాన్ని అంచనా వేసి గత సంవత్సరం డబ్బుల్ని ఈ సంవత్సరం నష్టాన్ని రైతులకు చెల్లించి పరువు కాపాడుకోవాలని లేని పక్షంలో రైతుల్ని సమీకరించి పోరాటాలు తీవ్రతరం చేస్తామని దావూద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో టిఎల్ రవి. తోలెం కృష్ణయ్య. ఎండి యాకూబ్. రెడ్డి వెంకటరెడ్డి. యానాల నర్సిరెడ్డి. ఈసం నారాయణ. పెంచికల లక్ష్మీనారాయణ. ఈసం రమేష్. బత్తుల యాదగిరి లు పాల్గొన్నారు

## సుబ్బయ్యతోట అర్బన్ పీహెచ్‌సీలో కాలం చెల్లిన మందులు

### రోగుల పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు

### వైద్య సిబ్బంది నిర్వాకం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

### :బాధిత మహిళ నారాయణమ్మ

చిలకలూరిపేట: పట్టణంలోని సుబ్బయ్యతోట అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కాలం చెల్లిన మందులు ఇస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. తోట నారాయణమ్మ అనే మహిళ స్థానిక హెల్త్ సెంటర్ కు చేరుకొని వైద్య సిబ్బంది తీరుపై మండి పడ్డారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తనకు చదువులేదని, గతం నుంచి తాను షుగర్ కోసం ఇక్కడే మందులు తీసుకొని వెళ్లి వాడుతుంటానని, ఈ నెల ఏడో తేదీ షుగర్ మందులు తీసుకొని వాడటం మొదలు పెట్టగానే రీయాక్షన్ వచ్చిందని, కాలు, చేయి పడిపోయిందని, అనేక అనారోగ్య సమస్యలు తలెత్తయాయని తెలిపారు. తన కుమారుడు టాబ్లెట్ల చూసి వీటి కాలపరిమితి జనవరిలోనే ముగిసిందని, కాలం చెల్లిన మందులు వాడినట్లు తెలిపాడని చెప్పారు. కాలం చెల్లిన మందులను అందజేయడటమే కాకుండా,రోగుల పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. స్థానిక అర్బన్ హెల్త్‌సెంటర్ వ్యవహారంపై తాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. వెంటనే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శక్తి యాప్‌తో తప్పిన ప్రమాదం

### శక్తి యాప్ అలర్ట్‌తో క్షణాల్లో చేరుకున్న పోలీసులు

### సాంకేతికతతో సురక్షితం? శక్తి యాప్ ప్రభావం

శక్తి యాప్ వినియోగంతో ఓ యువతి అత్యాచారయత్నం నుంచి తప్పించుకున్నట్లు మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. విజయవాడ బస్టాండ్‌లో ఆటో ఎక్కిన యువతిని చిన్న కాకాని సమీపంలో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నానికి పాల్పడగా, ఆమె శక్తి యాప్ ద్వారా సమాచారమిచ్చింది. వెంటనే స్పందించిన ఆయన నిందితుడు ఫణీంద్రను వెంబడించి పట్టుకుని యువతిని రక్షించినట్లు తెలిపారు...బెంగళూరు నుంచి అర్ధరాత్రి బయలుదేరి విజయవాడకు చేరుకున్న యువతి అప్రమత్తతతో ప్రమాదం నుంచి తప్పించుకుంది. గురువారం రాత్రి విజయవాడ బస్టాండ్‌లో ఓ ఆటో డ్రైవర్ మాయమాటలు చెప్పి ఆమెను తన వాహనంలో ఎక్కించుకున్నాడు..ఆటో మంగళగిరి దాటి చిన్న కాకాని సమీపానికి చేరుకున్న తర్వాత డ్రైవర్ యువతిపై అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. భయాందోళనకు గురైన యువతి సమయోచితంగా "శక్తి యాప్" ద్వారా పోలీసులకు సమాచారాన్ని చేరవేసింది.సమాచారం అందుకున్న మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ వెంటనే పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని యువతిని రక్షించారు. ఈ క్రమంలో నిందితుడు పారిపోవడానికి యత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితుడు ఫణీంద్రగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.యువతిని సురక్షితంగా ఆమె స్వస్థలానికి చేర్చినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో "శక్తి యాప్" వినియోగం ఎంత ప్రభావవంతంగా ఉంటుందో ఈ ఘటన స్పష్టంచేసిందని గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ పేర్కొన్నారు.

## పసిఫిక్ మహా సముద్రం ఎల్ నినో ఉపరితల ఉష్ణోగ్రతతో తాగునీరు, వ్యవసాయంపై ప్రమాద హెచ్చరిక.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 24 ఏప్రియల్ 2026**నాగరిత పెరుగుదలకు నీటి విలువ ఏమిటో జగమెరిగిన సత్యం కాగా ప్రస్తుత తయిణంలో ఎల్ నినో కారణముగా పసిఫిక్ మహా సముద్రంలో జరుగుతున్న సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల ప్రభావంతో తాగునీరు, వ్యవసాయం రెండింటి పైనా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం గురించి ఇప్పటికే భారత మెట్రోలాజికల్ డిపార్ట్మెంట్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో నీటి కొరత కనిపిస్తున్న వేళ, వేడి తరంగాలు పెరగడంతో సంక్షోభం అత్యంత ప్రమాదకర స్థాయి కెళ్తుంది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం లిఫ్ట ఇరిగేషన్ ప్రాజెక్ట్ పై కాంగ్రెసు ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం ప్రశ్నించాల్సిన అంశం కాగా మూడు బారేజీలు 19 రిజర్వాయర్లతో దేశంలోనే అతి పెద్ద నీటి ప్రాజెక్ట్గా నిలిచిన ప్రాజెక్ట్ను గత 2½ సంవత్సరములుగా విచారణలు, కమిషన్ల పేరుతో కావాలనే పక్క త్రోవ పట్టించడం కాంగ్రెసు ఘనత. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఈ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు వస్తున్న మంచి పేరు చెడ గొట్టడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరిస్తున్న అనుమానాలు బల పడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర అత్యుత్తమ న్యాయ వ్యవస్థ తీర్పు ప్రకారం జస్టిస్ పి సి ఘోష్ కమిషన్ 86 పియర్స్ లో కేవలం 2, 3 పియర్స్ సమస్యలను పరిష్కరించ కుండా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసిన విషయం కాస్తా బయట పడింది. ఇది పరిపాలనా వైఫల్యం కాదు - రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా వనరులను పణంగా పెట్టిన చర్యగా భావించాల్సి ఉంటుంది. ఎల్ నినో హెచ్చరికలు తీవ్రంగా ఉన్న సమయంలో మెడిగడ్డ వద్ద మరమ్మతులు చేపట్టకుండా ప్రజలను మభ్య పెట్టడానికి సందర్శనలు చేపట్టడం కాంగ్రెసు ప్రభుత్వం చేస్తున్న ద్వంద నీతికి పరాకాష్టగా ఉన్నది. తమ నిర్ణయ లోపాలతో ఎస్.ఎల్.బీ.సీ సొరంగం కూలిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతీక. కీలకమైన నీటి మౌలిక వసతులను సంరక్షించడంలో విఫలమైన కాంగ్రెసు ప్రభుత్వం, రాజకీయ విమర్శలతో కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తోంది. నీటి వనరులు లేని దేశాలు ఎంతో వ్యయ ప్రయాసలతో సముద్రపు ఉప్పునీటి నుండి లవణాలు, ఖనిజాలను తొలగించి త్రాగడానికి మారుస్తున్న తరుణంలో, నీటి సంక్షోభం వంటి అత్యవసర అంశాల్లో ప్రభుత్వం చూపాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, రాజకీయ కక్ష సాధింపుల కోసం ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం అత్యంత ప్రమాదకరం.

ప్రజల ప్రాణాలు, రైతుల భవిష్యత్తు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అన్నీ రాజకీయ ప్రతీకారల కోసం బలవు తున్నాయి. నీటి వనరుల సంరక్షణపై తక్షణ చర్యలు తీసుకోలేకపోతే ఇట్టి నిర్లక్ష్యానికి మూల్యం కాంగ్రెసు ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుందనీ మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, విజయ లక్ష్మి, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, సుమనళిని, బాబు రావు, రాజేంద్ర ప్రసాద్, నూకల మంజు, శ్యామలెట్ రేఖ, చెరుకూరి బాలాజీ, శ్రీనివాస్, నగేష్ తది తరులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆర్ టీ సీ కార్మికుల 32 డిమాండ్ల కోసం ప్రాణ త్యాగం చేసిన శంకర్ గౌడ్ కు శ్రద్ధాంజలి ఘటించిన మణికొండ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 24 ఏప్రియల్ 2026**తెలంగాణ ఆర్ టీ సీ కార్మికులు 32 డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ ప్రభుత్వం కాలాతీతం చేయడానికి వేసిన ఐ.ఏ.ఎస్ అధికారుల కమిటీ 4 వారాల గడువు కోరడం సమ్మెను నీరు గార్చడమేనని తలచి డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మ హత్యకు ప్రభుత్వమే కారణమని మణికొండ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, విజయ లక్ష్మి, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, సుమనళిని, బాబు రావు, రాజేంద్ర ప్రసాద్, నూకల మంజు, శ్యామలెట్ రేఖ, చెరుకూరి బాలాజీ, శ్రీనివాస్, నగేష్ తది తరులు ఆరోపిస్తూ, ప్రభుత్వం అతని కుటుంబానికి ఎక్స్ గ్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, అతని ఆత్మ శాంతికై ఒక నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించడం జరిగినది.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మన చౌదరి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 24:**శుక్రవారం నిజాంపేట్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూరోజుకు ఎంత ఓపి ఉంటుందని, ఆసుపత్రిలోని మౌలిక వసతుల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పార్టిషన్, ల్యాబ్, స్టోర్ చేయించాలని మెడికల్ ఆఫీసర్ కోరగా అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు.స్థానికంగా ఎక్కువ సంఖ్యలో జనాభా ఉన్నారని, ఆశావర్కర్లు కావాలని కలెక్టరును కోరారు. ఎఎన్సి చెక్ అప్ లు , ఎనిమియా కేసుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఫార్మసిస్ట్కు ఔషధాల నిల్వలను సమర్థంగా నిర్వహిస్తూ, ఎమర్జెన్సీ కార్నర్ను సక్రమంగా ఉంచాలని సూచించారు. పేషంట్లకు మందులు అందించేటప్పుడు ఎక్స్పైరీ డేట్ చెక్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిష్టర్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్, ఇమ్యునైజేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం అవసరమైన నిధులను సమకూర్చుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం స్థానికులు చిన్న పిల్లల కోసం ఒక అంగన్ వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టరును కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా అంగన్ వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు అవసరమైన వివరాలు సేకరించి ప్రతిపాదనలు పంపాలని నిజాంపేట్ ఎంఆర్ఓకు కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో నిజాంపేట్ తహసీల్దార్ వాణి, డిప్యూటి డిఎంఅండ్ హెచ్ఓ లావణ్యరెడ్డి, మెడికల్ ఆఫీసర్ మాధురి, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మచ్చాపూర్ జీకే గుంపును సందర్శించి గుత్తికొయా ప్రజల సమస్యలపై స్పందించిన జిల్లా ఎస్ పి కేకన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 24 గోవిందరావుపేట్** గోవిందరావు పేట మండలం పరిధిలోని మచ్చాపూర్ జీ కే గుంపును సందర్శించి అక్కడ నివసిస్తున్న గుత్తికోయ గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ సమస్యలను ఎస్పీ గారికి వివరించారు.

అడవి ప్రాంతంలో నివసిస్తున్నందున వర్షాకాలంలో వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని తెలిపారు. అందువల్ల వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మెరుగైన రహదారులు వంటి ప్రాథమిక అవసరాలపై కూడా తమ సమస్యలను ఎస్పీ కి వివరించారు.



ఈ సందర్భంగా ఎస్పీ గుత్తికోయ గిరిజనులతో మాట్లాడుతూ , వారి సమస్యలను సంబంధిత ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

అలాగే అడవుల్లో చెట్లను నరికరాదని, ఇతర రాష్ట్రాలు ముఖ్యంగా ఛత్తీస్గఢ్ లేదా ఇతర ప్రాంతాల నుండి కొత్త వ్యక్తులను గుంపులోకి ఆహ్వానించవద్దని సూచించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రస్తుతం తెలంగాణ మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా మావోయిస్టు ప్రభావం తగ్గుముఖం పట్టిందని పూర్తిగా నిర్మలమైందశీటూ పేర్కొంటూ, గిరిజనుల పిల్లలు తప్పనిసరిగా విద్యను అభ్యసించాలని, పాఠశాల స్థాయిలో ఎలాంటి డ్రాప్అవుట్లు ఉండకూడదని సూచించారు. విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, గిరిజనుల అభ్యున్నతికి పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు.


ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, నీటి సీసాలు పంపిణీ చేశారు. అనంతరం ఎస్పీ గుత్తికోయ గిరిజనులతో కలిసి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ పస్రా దయాకర్, ఇన్స్పెక్టర్ శంకర్, ఎస్ఐ పస్రా తాజుద్దీన్, ఎస్ఐ అంజనేయులు మరియు గుత్తికోయ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలు

### అధికారుల నిర్లక్ష్యమా? విద్యుత్ వృధా కాదా?





**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 24( ప్రజాబలం ప్రతినిధి)**ఒకవైపు విద్యుత్ పొదుపు చేయాలని ప్రభుత్వం ఊదరగొడుతుంటే, మరోవైపు క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం విద్యుత్ వృధాకు నిలువుటద్దంగా మారుతోంది. తాజాగా నెహ్రూ నగర్ లో గత మూడు రోజులుగా విద్యుత్ స్తంభాలపై పగలు, రాత్రి(24 గంటలు) వీధిదీపాలు వెలుగుతూ కనిపిస్తున్నాయి. సూర్యుడు ప్రచండంగా ప్రకాశిస్తున్నప్పటికీ, ఈ దీపాలను ఆర్పే నాథుడే కరువయ్యారు.ప్రశ్నార్థకంగా మారిన పర్యవేక్షణ సాధారణంగా సూర్యోదయానికి ముందే వీధిదీపాలను నిలిపివేయాలి. ఇందుకోసం ప్రత్యేక సిబ్బంది లేదా ఆటోమేటిక్ సెన్సార్లు ఉండాలి. కానీ, ఈ చిత్రంలో కనిపిస్తున్నట్లుగా మధ్యాహ్నం వేళలో కూడా దీపాలు వెలుగుతూనే ఉండటం అధికారుల పర్యవేక్షణా లోపాన్ని ఎత్తిచూపుతోంది.

ఇక్కడ ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నాను ఇలా చేస్తే,

ప్రజాధనం వృధా కాదా? వేల రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన విద్యుత్ ఇలా అనవసరంగా వృధా అవుతుంటే దానికి బాధ్యులు ఎవరు? నిర్వహణ లోపం ఎవరిది? వీధిదీపాల పర్యవేక్షణకు కేటాయించిన సిబ్బంది తమ విధులను సరిగ్గా నిర్వహిస్తున్నారా? లేదా? సెన్సార్ల పరిస్థితి ఏంటి? స్మార్ట్ సిటీలు, ఆటోమేషన్ అని చెబుతున్న తరుణంలో, కనీసం లైట్లు ఆర్పే సాంకేతికత ఎందుకు పని చేయడం లేదు?సామాన్యుడిపై భారం పడాల్సిందేనా సామాన్యుడు ఒక నెల విద్యుత్ బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్ చేసే అధికారులు, ఇలా బహిరంగంగా వందలాది యూనిట్ల విద్యుత్ వృధా అవుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. తక్షణమే చర్యలు తీసుకొని.

ఈ వృధాను అరికట్టేందుకు సంబంధిత విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవడమే కాకుండా, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. విద్యుత్ పొదుపు అనేది కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, ఆచరణలో చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మధుసూదన్ రెడ్డి ఎన్నిక పట్ల అభినందన....



నాగర్ కర్నూల్ జిల్లా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ మధుసూదన్ రెడ్డి గారిని నాగర్కర్నూల్ డిఈఓ రమేష్ కుమార్ గారు అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీధర్ రావు ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో రెండవ శనివారం ఆదివారం విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెండు జజూ ం మంజూరు చేయవలసిందిగా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రమేష్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ పూర్వాధ్యక్షులు ఎస్ మురళి జిల్లా నాయకులు కరుణాకర్ రెడ్డి మండల బాధ్యులు బాలస్వామి, సురేష్ బాబు, శేఖర్ నరసింహ, పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా 15వ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆరాధన దినోత్సవం....

## ఆర్టీసీ బస్టాండ్,ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో 3వేలకు పైగా మందికి అన్న ప్రసాద పంపిణీ...

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 15వ ఆరాధన దినోత్సవ కార్యక్రమాలు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు శ్రీ సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు హకీం విశ్వప్రసాద్ తెలిపారు. శ్రీసత్య సాయి బాబా దేవాలయంలో తెల్లవారుజామున భక్తులు సామూహికంగా స్వామివారికి ప్రత్యేకంగా అభిషేక పూజలు,ప్రత్యేక భజనలు,అర్చనలు,హారతులు చేశారు.బాబా వారి15వ ఆరాధన దినోత్సవ సందర్భంగా నాగర్ కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్ లో అన్నప్రసాద పంపిణీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూలుకు స్వయంగా బాబా వారు 1979లో వచ్చిన సందర్భాన్ని గుర్తు చేశారు.సత్యసాయిబాబా ట్రస్ట్, సత్యసాయి సేవా సంస్థ లు సామాజిక ఆధ్యాత్మిక నిత్య అన్నప్రసాద కార్యక్రమాలు ఇతోదికంగా నిర్వహిస్తుందని అన్నారు.ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో





సత్యసాయిబాబా నిత్య అన్నప్రసాద పంపిణీ శిబిరంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు హకిం మురళి, ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.రోహిత్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య లు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రోగి సహాయకులకు అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి ఆవరణలో సత్యసాయి సంస్థ ద్వారా నిత్యం ప్రతిరోజు మధ్యాహ్నం 150 మందికి రోగి సహాయకులకు అన్న ప్రసాద పంపిణీ చేయడం ఎంతో పుణ్యకార్యం అని అన్నారు. సత్య సాయి సంస్థ ద్వారా ఈరోజు 3వేల మందికి పైగా స్వామివారి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేసినట్లు సత్యసాయి సేవా సంస్థ కన్వీనర్ బాలరాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్య సాయి భజన మండలి, యువత,మహిళ, సేవాదళ్ కన్వీనర్లు, పట్టణంలోని వివిధ వార్డుల బాధ్యులు, కన్వీనర్లు,సభ్యులు,బాల వికాస్ గురువులు, సభ్యులు,సాయి భక్తులు మహిళలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## పంచలింగాల్ సల్ల ఊటపనికి వెళ్దాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం మర్పల్లి ఏపీవో అంజిరెడి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 24 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాలు గ్రామంలో ఉపాధి హామీ పని వారు అందరూ ఉదయకాలం తొందరగా పనికి వెళ్లి పని ముగించుకొని ఎండ దెబ్బ తగలకుండా తమ గృహాలకు వెళ్లాలని మర్పల్లి ఏపీఓ అంజిరెడ్డి తెలిపారు ఉదయకాల సమయంలో అందరూ ఉపాధి పని కూలీలు సమయపాలన పాటించి మొదటి ఫోటో దిగి ప్రదేశానికి వెళ్లి పని పూర్తి చేసుకొని చెట్ల నీడకు విశ్రాంతి తీసుకొని సమయం అయిన వెంటనే మళ్ళీ ఫోటో దిగి వెంటనే తమ తమ గృహాలకు వెళ్లాలని అందరూ ఉదయకాల సమయంలో సమయపాలన పాటించాలని పంచలింగాల్ ఫీల్డ్ అసిస్టెంట్ బి శేఖర్ మరియు సీనియర్ మేటి కేసారం సంజీవులు తెలిపారు



## విద్యుత్ ఘాతంతో రెండు పాడి గేదెలు మృతి

### బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి రాందేని నరసింహమూర్తి రాజు సర్పంచ్





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి, ఏప్రిల్ 24 ఏటూరునాగారం**పంట పొలాల్లో రెండు పాడి గేదెలు విద్యుత్ ఘాతానికి గురై శుక్రవారం మృతి చెందాయి

మండలంలోని షాపేల్లి గ్రామంలో ఉదయం సమయంలో రెండు పాడి గేదెలు మేత కోసం వెళ్ళాయి ఈ క్రమంలో విద్యుత్ తీగలు పంట పొలాల్లో తెగి పడడంతో వాటికి తగిన గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి బాధితులు చీపురు మల్లక్క రాందేని రాములు గేదెల నుండి వచ్చే ఆదాయాన్ని కోల్పోయామని విలపించారు సందర్భంగా గ్రామ సర్పంచ్ రామ్ దేని నరసింహమూర్తి రాజు మాట్లాడుతూ ఒక్కో పాడి గేదే 30 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం అధికారులు స్పందించి బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని బాధితులను ఆదుకోవాలని సర్పంచ్ తెలిపారు.

# ఉపాధి హామీ సిబ్బందికి తీపి కబురు రూ.కోటి వరకు ప్రమాద బీమా వర్తింపు

## వేతన బకాయిల కింద రూ.78కోట్లు విడుదల

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 24 ( ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**జాతీయ గ్రామీణ ఉపాధి హామీస పథకం పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి,రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది రాష్ట్రంలోని 3,700మంది సిబ్బందికి రూ.కోటి వరకు ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం కల్పించనుంది. కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ పథకం కింద ఎస్బీఐ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఉద్యోగి జీతం ఆధారంగా రూ.40లక్షల నుంచి రూ.కోటి వరకు ఈ బీమావర్తింపచేయనున్నారు ప్రమాద బీమా కోసం అటు ఉద్యోగులు,ఇటు ప్రభుత్వం ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి రాష్ట్రంలోని 11,760 మంది ఉపాది హామీ సిబ్బంది జీతాలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.78కోట్లు విడుదల చేసింది మరోవైపు ఉపాధి హామీ పథకం కింద గ్రామీణప్రాంతాల్లోపనిచేస్తున్న,కూలీల వేతన బకాయిలను చెల్లించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఫిబ్రవరి 10నుంచి మార్చి 31వరకు ఉన్న రూ.383కోట్ల వేతన బకాయిలను చెల్లించేందుకుగాను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. వారం రోజుల్లోగా కూలీల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 20 ఏళ్లుగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయ?సగా(ఎఫ్టీఈ)లుగా గుర్తించాలని, ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యకు ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.బి





## మంత్రి తుమ్మల ని కలిసిన కురుమ సంఘం నేతలు



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 24 (ప్రజాబలం)** ఖమ్మం మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గని ఆలేరుశాసనసభ్యులు బీర్ల అయిలయ్య సమక్షంలో ఖమ్మం నగర కురుమ సంఘం నేతలు హైద్రాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మరాటి రమేష్, కార్యదర్శి మాలిగ గౌరి శంకర్ లు ఖమ్మం నగర కురుమ సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం లో దొడ్డి కొమురయ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి గారు నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. కురుమ సంఘం పెద్దలు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, నాయకులు దయ్యాల నాగేశ్వరరావు, కాటం యాదయ్య, గొరిగె నాగులు మరియు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి దామోదర్ రాజానర్సింహా....



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 24 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** ఆర్టీసీ కార్మికుల సమస్యలు చర్చల ద్వారా మాత్రమే పరిష్కారం చేసుకోవాలి ఈరోజు కాబినెట్ సమావేశం లో మొట్టమొదటి అంశం ఆర్టీసీ అంశాన్ని చర్చించాము,రేపు ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని నిర్ణయం తీసుకున్నాంఈరోజు జరిగిన సంఘటన మళ్ళీ జరగకుండా చూస్తాం.నర్సింపేట్ డ్రైవర్ శంకర్ ను హైదరాబాద్ కంచన్ బాగ్ లో డిఆర్డిఓకు తరలిస్తున్నాం.ఎలాంటి సంఘటన లు జరగకుండా చూస్తాం.మీ డిమాండ్స్ కు పరిష్కారం చూపే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది,క్షణికవేశం కు, ఎవ్వరు గురి కావొద్దు.

## ఉపాధి హామీ కూలీలు ఉదయం 6 గంటలకు తొందరగా పనికి వెళ్లి 10 గంటలకు ఇంటికి రావాలి




### పుల్కల్ ఎంపీడీవో ఆనంద్ మేరీ

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 24 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** : పుల్కల్ మండల పరిధిలోని ఎస్ ఇటిక్యాల గ్రామ శివారులో జరుగుతున్నటువంటి, ఉపాధి హామీ పనులకు వెళ్లే ఉపాధి కూలీలు సమయపాలన పాటించి, మీ మీ ఆరోగ్య రీత్యా, ఉదయం 6 గంటలకు వెళ్లి, మొదటి ఫోటో దిగి, పని ప్రదేశానికి వెళ్లి పని ముగించుకొని, చెట్ల నీడకు విశ్రాంతి తీసుకోని 10 గంటలకు రెండో ఫోటో దిగి తమ ఇళ్లకు చేరుకోవాలని, పుల్కల్ ఎంపీడీవో ఆనంద్ మేరీ కోరారు ,ఒకవేళ ఆలస్యం అయితే, పని ముగించుకొని, చెట్ల నీడలో ఉండి తమ దాహం తీర్చుకొని తొందరగా రెండో ఫోటో కూడా దిగి తమ ఇళ్లకు చేరుకోవాలని, అధిక వేడి వల్ల, ఎక్కువసేపు ఎండలో ఉంటే వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, కావున, ఉపాధి హామీ కూలీలు దీనిని దృష్టిలో పెట్టుకొని, సమయపాలన పాటించి తమ ఆరోగ్యాలు కాపాడుకోవాలని ఆమె అన్నారు గ్రామ సర్పంచ్ స్వప్న సురేందర్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్, సూర్ రెడ్డి, ఇదే విషయాన్ని ఉపాధి హామీ కూలీలనుకోరుతున్నారు.

## పట్లూర్ నందు ప్రకాష్ బర్త్డే కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, మండల ప్రెసిడెంట్ తుమ్మల సురేష్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 24 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో పిలిస్తే పలికే యువ నాయకుడు ప్రజా సేవకుడు మంచి వ్యక్తిత్వం ఉండి భారీ మెజార్టీతో వార్డు మెంబర్గా గెలుపొందిన నందు ప్రకాష్ బర్త్డే కార్యక్రమంలో వికారాబాద్ డిసిసి వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు, బర్త్డే సందర్భంగా ఉపాధి హామీలో పని చేస్తున్నటువంటి పని వాళ్లకు అందరికీ లెమన్ బట్టర్ మిల్క్ బర్త్ డే సందర్భంగా పంపిణీ చేయడం జరిగింది గ్రామ పెద్దలు అక్క చెల్లెలు అన్నలు అందరూ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని నందు ప్రకాష్ ని ఆశీర్వదించినట్టు తెలిపారు బర్త్డే కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్, మరియు ప్రత్యేకంగా విషెస్ తెలిపిన గ్రామ సర్పంచ్ పరుశురాం, ఉపసర్పంచ్ అఖిల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ కుమార్, చాట్ల రాకేష్, గుడ్ల మర్పల్లి సర్పంచ్ పురుషోత్తం, మాజీ సర్పంచ్,రచ య్యా, సర్వేష్ అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ పృథ్వీరాజ్, పెద్దలు సీనియర్ నాయకులు యువకులు బర్త్డే కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు



## ఉపాధి హామీ కూలీలు ఉదయం 6 గంటలకు తొందరగా పనికి వెళ్లి 10 గంటలకు ఇంటికి రావాలి
### యస్,ఇటిక్యాల గ్రామ సర్పంచ్ స్వప్న సురేందర్ గౌడ్





ఎఫ్ఏ. సూర్ రెడ్డి ఎస్..ఇటిక్యాల

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 24 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల పరిధిలోని ఎస్ ఇటిక్యాల గ్రామ శివారులో జరుగుతున్నటువంటి, ఉపాధి హామీ పనులకు వెళ్లే ఉపాధి కూలీలు సమయపాలన పాటించి, మీ మీ ఆరోగ్య రీత్యా, ఉదయం 6 గంటలకు వెళ్లి, మొదటి ఫోటో దిగి, పని ప్రదేశానికి వెళ్లి పని ముగించుకొని, చెట్ల నీడకు విశ్రాంతి తీసుకోని 10 గంటలకు రెండో ఫోటో దిగి తమ ఇళ్లకు చేరుకోవాలని ఒకవేళ ఆలస్యం అయితే, పని ముగించుకొని, చెట్ల నీడలో ఉండి తమ దాహం తీర్చుకొని తొందరగా రెండో ఫోటో కూడా దిగి తమ ఇళ్లకు చేరుకోవాలని, అధిక వేడి వల్ల, ఎక్కువసేపు ఎండలో ఉంటే వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, ఉపాధి హామీ కూలీలు దీనిని దృష్టిలో పెట్టుకొని, సమయపాలన పాటించి తమ ఆరోగ్యాలు కాపాడుకోవాలని గ్రామ సర్పంచ్ స్వప్న సురేందర్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్, సూర్ రెడ్డి, ఉపాధి హామీ కూలీలను కోరుతున్నారు......

# రుద్రంగిలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

**సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం..**
**ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి**
**వేములవాడలో ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్**
**భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి**
**డీజీపీ బీ శివధర్ రెడ్డి**
**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**







**రాజన్న సిరిసిల్ల జిల్లా/ రుద్రంగి, ఏప్రిల్ -24 (ప్రజాబలం ప్రతినిధి)**రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని డీజీపీ బీ శివధర్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ.2 కోట్ల 50 లక్షలతో ఎకరం స్థలంలో ఆధునిక హంగులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డీజీపీ బీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డీజీపీ బీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. మావోయిజం అంతమైందని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసింగ్ లో నూతన మార్పులు తీసుకువస్తామని వెల్లడించారు. ప్రజల కేంద్రగానే సేవలు అందించేలా పోలీసులకు శిక్షణ ఇస్తామని, అదే స్థాయిలో విస్తృత సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తమ కోసం.. తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హత్యలు, ఇతర కారణాలతో రాష్ట్రంలో ఎక్కువ మరణాలు జరగడంలేదని, రోడ్డు ప్రమాదాల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఇంటి నుంచి బయటకు వచ్చిన తర్వాత తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. పౌరులు బాగుంటే రాష్ట్రం.. దేశ అభివృద్ధి సాధ్యమని, ఇందులో భాగంగానే అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు.వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉన్న నేపథ్యంలో వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, అలాగే భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళు _తున్నానని తెలిపారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ అండగా ఉంటున్నారని చెప్పారు.

**ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకం**

ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకమైనవి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. అన్ని సెలవుల్లో వారు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు ట్రాఫిక్ నియమాలు పాటించేలా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ నిర్వహిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు దాడులు చేస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తాను కోరిన వెంటనే రుద్రంగికి సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ స్టేషన్ మంజూరు చేశారని వెల్లడించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ విస్తరణ పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, మూలవాగు పై మూడో బ్రిడ్జి పనులు చేయిస్తున్నామని, రుద్రంగికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు అయిందని, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వేములవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,
మహిళా పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, అలాగే భీమారంలో పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, వేములవాడలో ఆలయ భద్రత సిబ్బంది సంఖ్యను పెంచాలని డీజీపీని కోరారు. రుద్రంగి, భీమారంలో రెవెన్యూ, మండల పరిషత్ భవనాలు ఇస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో తాను భాగస్వామి కావడం అదృష్టమని పేర్కొన్నారు.

**నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకం**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత.. మెరుగైన సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించామని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ, అధికార యంత్రాంగంతో కలిసి ఇటీవల జిల్లాలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, మహా శివరాత్రి జాతర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జనవరిలో జాతీయ భద్రతా మాసోత్సవాలు నిర్వహించామని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఇటీవల అరైవ్.. అలైవ్ కింద జిల్లాలో నో హెల్మెట్.. నో ఎంట్రీ అమలు చేస్తున్నామని, ఇప్పటికే అన్ని గ్రామాల సేఫ్టీ కమిటీలకు తెలిపామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

**నేరాల నియంత్రణ కోసం..**

జిల్లాలోని రుద్రంగి మండలం చిన్నదని, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. మండల ప్రజల సహకారంతో మండల కేంద్రంలో నేరాల నియంత్రణ కోసం ఇటీవల హై క్వాలిటీ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్ పిఆర్) సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మితమయ్యే ఈ పోలీస్ స్టేషన్ ద్వారా మండల ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే కాకుండా, ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుందన్నారు. అరైవ్.. అలైవ్ కింద జిల్లాలోని ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్ బస్, ఆటో మున్సిపల్ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని, సీపీఆర్, ప్రాథమిక ఆరోగ్య చికిత్స పై అవగాహన కల్పించామని వెల్లడించారు.

కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ లు, ఎస్ఐలు, సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఫిలింనగర్లో బెంజ్ కారు బోల్తా.. తీవ్ర ట్రాఫిక్ జామ్

హైదరాబాద్ హైదరాబాద్లోని ఫిలింనగర్ ప్రాంతంలో ఓ లగ్జరీ కారు బోల్తా పడడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ౧ఉ 09 ఊ 5341 నంబర్ గల ఓవతీఇవటవబ?ఃవనిళి ఇజీతీ రోడ్డు మధ్యలో బోల్తా పడింది. ప్రమాదం జరిగిన తర్వాత కారు యజమాని వాహనాన్ని అక్కడికక్కడే వదిలేసి పరారైనట్లు సమాచారం. కారు రోడ్డుపై ఉండటంతో కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయి భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్ను సర్దుబాటు చేసారు. అలాగే కారు యజమాని కోసం గాలింపు చేపట్టారు.

## సెక్యూరిటీ గార్డ్ పై దాడి..తీవ్ర గాయాలు

హైదరాబాద్ గచ్చిబౌలి నాన్నక్ రామ్ గూడ లో డీజే ఆపరేటర్ ప్రతాప్ రెడ్డి హంగామా చేసాడు. కారు పార్క్ చేయకూడదు అని చెప్పడంతో బ్యాంక్ సెక్యూరిటీ పై దాడి చేసాడు. శంగా కుడి చేతితో ఎల్బో పంచ్ ఇచ్చాడు. ఎల్బో పంచ్ దెబ్బకు సెక్యూరిటీ గార్డ్ ఘన్సం కుమార్ సదా కింద పడిపోయాడు. అడ్డుకోవడానికి వచ్చిన బ్యాంక్ సిబ్బంది పై దాడికి యత్నం చేసాడు. దాడి దృశ్యాలు సీటీవీలో రికార్డ్ అయ్యాయి. బాధితుడి భార్య రేఖ దేవి గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేసింది. దాంతో 118(1) ఃబొ యాక్ట్ కింద కేసు నమోదు చేసారు. బాధితుడు నానక్ రామ్ గూడ స్టార్ హాస్పిటల్ లో చికిత్స

## ఇష్టం లేని గర్భం కొనసాగించాలని బలవంతం చేయలేము: సుప్రీంకోర్టు
### 15 ఏళ్ల బాలిక కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు.

ఏడు నెలల గర్భాన్ని తొలగించుకునేందుకు 15 ఏళ్ల బాలికకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని ఒక మహిళను మరీ ముఖ్యంగా బాలికను బలవంతం చేయలేమని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. అలా బలవంతం చేసే హక్కు ఏ న్యాయస్థానానికి లేదని స్పష్టంచేసింది. పుట్టబోయే బిడ్డ కంటే గర్భం కొనసాగించే విషయంలో ఆ మహిళ తీసుకునే నిర్ణయానికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇష్టం లేకుండా ఆ బాలిక తన గర్భాన్ని కొనసాగిస్తే అది ఆమె మానసిక ఆరోగ్యం, విద్యావకాశాలు, సామాజిక స్థితిగతులపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఒక బిడ్డకు జన్మనిచ్చే విషయంలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఆమెకు ఉండాలి. ఒక అవాంఛిత గర్భాన్ని కొనసాగించమని మహిళను ఒత్తిడి చేయడం అంటే.. ఆమె రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com